సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
మంగళవారం, 28.07.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 267
పేజీలు: 08 వెల: రూ. 5

## కేంద్రం హామీలను నిలబెట్టుకోవట్లేదు

కాక్రోచ్ జనతా పార్టీ సంచలన ఆరోపణలు



- ఆందోళనకారులపై కేసులు ఎత్తివేయాలని కేంద్రానికి అల్టిమేటం
- కేసులు ఉపసంహరించకపోతే తదుపరి ఉద్యమం
- బిహార్‌లో పోలీసుల తీరుపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు

02

## మా పెద్దిని కాపాడండి

వైద్యులకు చేతులెత్తి నమస్కరించిన అధినేత కేసీఆర్

- దేవుడున్నాడు, డాక్టర్లున్నారు.. అన్నీ సవ్యంగానే జరుగుతాయి
- గుండె చెదురొద్దు ధైర్యంగా ఉండండి
- పెద్ది భార్యా పిల్లలు,కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన కేసీఆర్
- ప్రపంచ స్థాయి చికిత్స: యశోద డాక్టర్లు

03



# రేవంత్ పై కేటీఆర్ లీగల్ ఫైట్

## రాజకీయ కౌంటర్ కంటే లీగల్ నోటీసులకే ప్రాధాన్యమా?




- కోర్టు పోరుతో రాజకీయ లాభం దక్కుతుందా?
- కేటీఆర్ వ్యూహంపై రాజకీయ వర్గాల్లో చర్చ
- నోటీసులే రేవంత్ ఆరోపణలకు ప్రచారమా?
- ప్రజాక్షేత్రం వదిలి కోర్టు బాట పట్టారా?
- లీగల్ స్ట్రాటజీ బీఆర్ఎస్‌కు మైనస్ అవుతోందా?
- రేవంత్ దూకుడుకు నోటీసులే సమాధానమా?
- రాజకీయ యుద్ధమా.. న్యాయపోరాటమా?
- ఆరోపణలపై కోర్టులను ఆశ్రయిస్తున్న కేటీఆర్?
- పొలిటికల్ ఫైట్‌లో లీగల్ రూట్ సరైనదేనా?

**ముద్ర డెస్క్:**
తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మధ్య మాటల యుద్ధం రోజు రోజుకూ మరింత తీవ్ర రూపం దాల్చుతోంది. ఇంటర్మీడియట్ మార్కుల వ్యవహారంతో ముడిపడిన గ్లోబ్‌ఎరీనా సంస్థ కేటీఆర్ బినామీ కంపెనీ అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలు రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన కేటీఆర్, 48 గంటల్లో బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ మరోసారి లీగల్ నోటీసులు జారీ చేశారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అయితే రాజకీయ ప్రత్యర్థులపై వస్తున్న ఆరోపణలకు రాజకీయ వేదికలపై గట్టిగా సమాధానం చెప్పకుండా, పదేపదే కోర్టులు, లీగల్ నోటీసులనే ఆశ్రయించడం కేటీఆర్ వ్యూహంలో భాగమా? లేక అది రాజకీయంగా ఆయనకు ప్రతికూలంగా మారుతోందా? అనే చర్చ తెలంగాణ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.



**లీగల్ నోటీసులే మొదటి అస్త్రమా?**

గత కొన్నేళ్లుగా కేటీఆర్ వ్యవహారశైలిని పరిశీలిస్తే, రాజకీయ ఆరోపణలు ఎదురైన ప్రతిసారీ ఆయన చట్టపరమైన మార్గానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నట్లు కనిపిస్తోంది. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో రేవంత్ రెడ్డి విసిరిన "వైట్ ఛాలెంజ్", డ్రగ్స్ ఆరోపణలు, ఫోన్ ట్యాపింగ్ వివాదం, ఫార్ములా–ఈ రేస్ అంశం, ఫామ్‌హౌస్ ఆరోపణలు వంటి అనేక సందర్భాల్లో కూడా కేటీఆర్ లీగల్ నోటీసులు పంపడం, కోర్టులను ఆశ్రయించడం జరిగింది. ఒక నాయకుడిగా తన ప్రతిష్ఠను కాపాడుకోవడానికి చట్టపరమైన చర్యలు తీసుకోవడం సహజమే అయినప్పటికీ, రాజకీయంగా మాత్రం ఇది రక్షణాత్మక వైఖరిగా కనిపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**ప్రజాక్షేత్రంలోనే రాజకీయ సమాధానం అవసరమా?**

ప్రజాస్వామ్యంలో రాజకీయ ఆరోపణలకు చివరి తీర్పు కోర్టుల్లో కాకుండా ప్రజల ముందే తేలుతుందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. రేవంత్ రెడ్డి తరచూ మీడియా సమావేశాలు, బహిరంగ సభల ద్వారా ప్రత్యర్థులపై తీవ్ర విమర్శలు చేస్తుంటే, కేటీఆర్ కూడా రాజకీయంగా స్పందిస్తున్నప్పటికీ, ప్రతి కీలక ఆరోపణ తర్వాత లీగల్ నోటీసులు జారీ చేయడం ఆయన వ్యూహంలో ప్రధానంగా కనిపిస్తోంది. దీంతో ప్రజల్లో ఒక ప్రశ్న తలెత్తుతోందని రాజకీయ వర్గాలు చర్చిస్తున్నాయి. ఆరోపణలకు రాజకీయంగా మరింత బలమైన కౌంటర్ ఇవ్వగల సామర్థ్యం ఉన్నప్పటికీ, ఎందుకు కోర్టులపైనే ఆధారపడుతున్నారనే సందేహం వ్యక్తమవుతోందంటున్నారు. నోటీసులే ప్రత్యర్థి ఆరోపణలకు ప్రచారం తెస్తున్నాయా?
రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ప్రతి లీగల్ నోటీసు తర్వాత ఆరోపణలు మరికొన్ని రోజుల పాటు మీడియా, సోషల్ మీడియాలో

మిగతా 04లో

## శివాని మృతి కలిచివేసింది

సీఎం చంద్రబాబు ఆవేదన

- పూర్తి దర్యాప్తుకు ఆదేశాలు
- ధైర్యంగా ఉండాలి విద్యార్థులకు సీఎం సూచన
- శివాని మాటలు గుర్తొస్తున్నాయి: లోకేశ్
- ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది
- సీఎం చంద్రబాబు

02





## రేవంత్ కొత్త వ్యూహం

యూత్‌ను ఆకట్టుకునే కాంగ్రెస్ మాస్టర్ ప్లాన్

- రేవంత్ నిర్ణయానికి కేసీఆర్ కౌంటర్ ఏంటి?
- తెలంగాణ రాజకీయాల్లో యువత చుట్టూ కొత్త సమీకరణాలు
- అసెంబ్లీలో యువతకు గుడ్ న్యూస్ చెప్పనున్న ప్రభుత్వం
- యువ రాజకీయాలకు ఊతమా.. కొత్త రాజకీయ ఎత్తుగడా?

**ముద్ర డెస్క్ :**
తెలంగాణ రాజకీయం ఆసక్తి కరంగా మారుతోంది. జాతీయ స్థాయిలో మారుతున్న సమీకరణాలు రాష్ట్ర రాజకీయం పైనా ప్రభావం చూపుతున్నాయి. కాక్రోచ్ పార్టీ.. యువత ఢిల్లీ కేంద్రంగా చేసిన ధర్నాలకు కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. హైదరాబాద్ లో బీఆర్ఎస్ నిరసన నిర్వహించింది. కాగా.. ఇప్పుడు యువతను తమ వైపు తిప్పుకునేందుకు కొత్త రాజకీయ వ్యూహాలు సీఎం రేవంత్ అమలు చేస్తున్నారు. అందులో భాగంగా అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. మిగతా 02లో

## మోడీ గేమ్

- రాజకీయ ఎత్తుగడలో పైచేయి?
- సీజేపీ ఎదుగుదలతో కాంగ్రెస్‌కు సవాల్?

# అర్థం కాలేదా?

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వెనుక వ్యూహమా?

04




*నీట్ పేపర్ లీకేజీ సెగ.. 'కాక్రోచ్ జనతా పార్టీ' నిరసనల దెబ్బకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వికెట్ పడటంతో విపక్షాలు సంబరాల్లో మునిగిపోయాయి. "మోదీ పని అయిపోయింది" అంటూ రాహుల్ గాంధీ మార్క్ కాంగ్రెస్ రచ్చ రచ్చ చేస్తోంది. కానీ సీనియర్ రాజకీయ పండితులు మాత్రం "ఇది మోదీ పతనం కాదు భయ్యా... విపక్షాలను ఉరితీసే ముందు వేసిన వ్యూహాత్మక వల" అని విశ్లేషిస్తున్నారు. విమర్శలు ముదిరిపాకక ముందే మంత్రి చేత రాజీనామా చేయించి, విద్యార్థుల కోపాన్ని తగ్గించడమే కాకుండా 'తప్పు జరిగితే బాధ్యత వహిస్తాం' అని చూపించుకోవడంలో మోదీ మళ్లీ తన మార్క్ పైచేయి సాధించారు. రాహుల్ గాంధీ క్రెడిట్ కొట్టేయాలని జంతర్మంతర్ నుంచి ప్రధాని ఇంటి వరకు హడావుడి చేసినా, సీజేపీ ఆయనను కనీసం కన్సిడర్ కూడా చేయలేదు! గతంలో ఆప్, సమాజ్ వాదీలను పెంచి పోషించి తానే బలైపోయిన కాంగ్రెస్... ఇప్పుడు ఈ కొత్త గ్రూప్‌కు చప్పట్లు కొడుతూ తన గొయ్యి తానే తవ్వుకుంటోందా? మోదీ పొలిటికల్ గేమ్‌ను అర్థం చేసుకోకుండా ఈ చిన్న చిన్న సంబురాలతో కాలం గడిపితే, కాంగ్రెస్‌కు మళ్లీ 'ప్రతిపక్ష హోదా' కలగానే మిగిలిపోవడం ఖాయంగా కనిపిస్తోంది!*

## మరో ఉద్యమం..

రిజర్వేషన్‌పై కొత్త సోషల్ మీడియా ఉద్యమం..!

04

*సంచలనం సృష్టిస్తున్న 'కాక్రోచ్ జనతా పార్టీ' స్ఫూర్తితో దేశంలో మరో ఆన్‌లైన్ ఉద్యమం ఊపందుకుంటోంది. 'రెస్పాన్స్ లేదా రిజర్వేషన్ హటావో ఆందోళన్' పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో మొదలైన ఈ విద్యార్థి ఉద్యమం, కుల ఆధారిత రిజర్వేషన్ల స్థానంలో మెరిట్, ఆర్థిక ప్రాతిపదికన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ యువతను విశేషంగా ఆకట్టుకుంటోంది.*

- యువతలో వైరల్ అవుతున్న 'రిజర్వేషన్ హటావో ఆందోళన్' క్యాంపెయిన్..
- మెరిట్ వర్సెస్ రిజర్వేషన్ చర్చ మళ్లీ తెరపై..!

RESERVATION HATAO ANDOLAN
EQUALITY. MERIT. JUSTICE.

## హైడ్రా కమిషనర్‌ను తొలగించండి




- హైకోర్టు సంచలన ఆదేశాలు
- హైడ్రాపై తీవ్ర ఆగ్రహం
- రూల్ ఆఫ్ లా దెబ్బతింటుందన్న హైకోర్టు
- కొత్త కమిషనర్ నియామకానికి సూచన
- హైకోర్టుకు రంగనాథ్ క్షమాపణ

02



## వారణాసిలో ఘోరం

ప్యాంట్‌లో మూత్రం పోసుకున్నాడని దారుణం..

03

ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 28.07.2026
www.mudranews.in | @mudranews



### కళ్లను శుభ్రంగా ఉంచండి



కళ్లను రోజుకు 2—3 సార్లు శుభ్రమైన నీటితో కడగండి. చేతులు కడగకుండా కళ్లను తాకవద్దు. దీంతో ఇన్ఫెక్షన్ ప్రమాదం తగ్గుతుంది.

# శివాని మృతి నన్ను కలచివేసింది

**ముద్ర, అమరావతి:** పోలవరం జిల్లా ఈర్లపల్లికి చెందిన పదో తరగతి విద్యార్థిని ముర్రం శివాని ఆత్మహత్య చేసుకోవడంపై ఏపీ సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మెగా పీటీఎంలో ఎంతో ఉత్సాహంగా మాట్లాడిన విద్యార్థిని మృతి తనను కలచివేస్తోందన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. 'పదో తరగతి విద్యార్థిని ముర్రం శివాని తనువు చాలించడం నన్ను తీవ్ర విషాదంలోకి నెట్టేసింది. రంపచోడవరంలో నిర్వహించిన మెగా పీటీఎంలో వేదికపై ఎంతో ఉత్సాహంగా మాట్లాడిన విద్యార్థిని బలవన్మరణం ఆవేదన కలిగించింది. ఆరోజు తన చదువు, ఉన్నత లక్ష్యాల గురించి శివాని నాతో చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నాయి. ఎంతో భవిష్యత్ ఉన్న గిరిజన బిడ్డ ఇలా తనువు చాలించడం బాధాకరం. కారణాలు ఏవైనా తన కలలు నిజం కాకుండానే ఆ విద్యార్థిని దూరమవడం కలచివేస్తోంది.

శివాని మృతిపై పూర్తి దర్యాప్తు జరపాలని అధికారులను ఆదేశించాను. సమస్యలు, కష్టాలు వచ్చినా విద్యార్థులు, యువత ధైర్యంగా నిలబడాలి. ఎవరూ ఒత్తిడి, నిరాశ, నిస్పృహలకు లోను కావొద్దు. ఎంతటి సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. మీ బాధ, ఆవేదనను కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఆత్మీయులతో పంచుకోండి. ఒత్తిడిని అధిగమించి మీ కలలను నిజం చేసుకునేలా ముందుకు సాగండి. ప్రభుత్వం అన్ని విధాలుగా మీకు అండగా ఉంటుంది'' అని చంద్రబాబు పేర్కొన్నారు.

**ఆమె మాటలు పదేపదే గుర్తొస్తున్నాయి: మంత్రి లోకేశ్**

రంపచోడవరం మెగా పీటీఎంలో ఎంతో ఆత్మవిశ్వాసంతో మాట్లాడిన శివాని మృతి తీవ్ర విషాదాన్ని నింపిందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ''విషయం తెలిసినప్పటి నుంచి శివాని మాటలు పదేపదే గుర్తొస్తున్నాయి. సోదరి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా. ఎంత కష్టమైనా పోరాడుదాం.. ఎంతటి సమస్యనైనా ఎదుర్కొందాం.. మీకు నేనున్నాను.. ఈ ప్రభుత్వం ఉంది'' అని లోకేశ్ పేర్కొన్నారు.

# రేవంత్ కొత్త వ్యూహం

(మొదటి పేజీ తరువాయి)

దీంతో.. మాజీ సీఎం కేసీఆర్ ఏం చేయబోతున్నారనేది ఆసక్తి కరంగా మారుతోంది. తెలంగాణ కేంద్రంగా రాజకీయ లెక్కలు వేగంగా మారుతున్నాయి. జాతీయ స్థాయిలో వేగంగా మారుతున్న పరిణామాలతో పార్టీలు అప్రమత్తం అవుతున్నాయి. అందులో భాగంగా యువతకు మద్దతుగా కాంగ్రెస్ కొత్త నిర్ణయాలకు సిద్ధమైంది. తాగాజా ఢిల్లీలో నిరసనలు.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో కాంగ్రెస్ యువతను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అందులో భాగంగా సీఎం రేవంత్ కీలక నిర్ణయం తీసుకున్నారు. వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో యువతకు ఎంపీ, ఎమ్మెల్యేలుగా పోటీచేసే వారి కనీస వయోపరిమితిని 25 ఏండ్ల నుంచి 21 సంవత్సరాలకు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఒక తీర్మానం చేయాలని నిర్ణయించారు. దీని ద్వారా యువతను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. జాతీయ స్థాయిలోనూ తమ ప్రభుత్వంలో యువతకు ప్రాధాన్యత దక్కేలా తాను చొరవ తీసుకుంటానని రేవంత్ హామీ ఇస్తున్నారు.

ఈ మేరకు యువతకు ఎన్నికల్లో పోటీ చేసే వయసు తగ్గిస్తూ అసెంబ్లీలో తీర్మానం దిశగా రేవంత్ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల ముహూర్తం దాదాపు ఖరారు చేసింది. ఆగస్టు 17నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. కనీసం వారం రోజులపాటు శాసనసభ సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నది. ఈ సమావేశాల్లో మరికొన్ని తీర్మానాలు, బిల్లులు పెట్టే అవకాశం ఉన్నది. శాసనసభ, శాసనమండలిలో ఆధునీక రించిన భవన సముదాయాలను సీఎం రేవంత్ ఆగస్టులో ప్రారంభించనున్నారు. అసెంబ్లీ సెంట్రల్ హాల్ సహా మంత్రుల చాంబర్ల పునర్నిర్మాణ పనులను ఆగస్టు 10 లోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. అయితే, యువ ఓటర్లను లక్ష్యంగా చేసుకొని రేవంత్ అమలు చేస్తున్న వ్యూహాలకు మాజీ సీఎం కేసీఆర్ ఎలాంటి కౌంటర్ స్కెచ్ అమలు చేస్తారనేది రాజకీయంగా ఆసక్తి కరంగా మారుతోంది.



# కమిషనర్‌ను తొలగించండి

**ముద్ర, హైదరాబాద్:** లోతుకుంట భూముల వ్యవహారానికి సంబంధించి తెలంగాణ హైకోర్టులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాలంటూ.. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి (సీఎస్) ఆదేశాలు జారీ చేసింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ధర్మాసనం పేర్కొంది.

అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని హైకోర్టు సూచించింది. 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం.. లోతుకుంట ప్రైవేటు భూములపై హైడ్రా జోక్యాన్ని తప్పుబట్టింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని పేర్కొంది. ఇన్ని ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికారిని ఇంకా అదే పోస్టులో కొనసాగించడం సరికాదని.. రంగనాథ్‌ను తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది.

**హైకోర్టుకు రంగనాథ్ క్షమాపణలు..**

ఈ కేసు విచారణ సందర్భంగా హైకోర్టుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ కోర్టుకు క్షమాపణలు తెలిపారు. కోర్టులు, న్యాయ వ్యవస్థపై తనకు ఎంతో నమ్మకం ఉందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే లోతుకుంట సర్వే నంబర్లు 1, 2 పరిధిలోని 40 ఎకరాల భూమిలోకి హైడ్రా బృందం వెళ్లలేదని కోర్టుకు వివరించారు. ఈ విషయంలో పిటిషనర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని కూడా రంగనాథ్ తన అఫిడవిట్‌లో తెలిపారు.

# కేంద్రం హామీలను నిలబెట్టుకోవట్లేదు



**ముద్ర, న్యూఢిల్లీ:** కాక్రోచ్ జనతా పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమకు ఇచ్చిన హామీని కేంద్రం నిలబెట్టుకోవట్లేదని ఆరోపించారు. పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా నిరసన చేపట్టిన ఆందోళనకారులపై నమోదైన కేసులు ఉపసంహరించుకుంటామని కేంద్ర మంత్రులు తమకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అందువల్లే తాము నిరసనలు నిలిపివేశామన్నారు. కానీ, ఇంతవరకూ విద్యార్థులు, ఇతర నిరసనకారులపై పెట్టిన కేసులను ఎత్తివేయలేదని తెలిపారు. అస్సాం, పశ్చిమ బెంగాల్, బిహార్ వంటి రాష్ట్రాల్లో పలువురు ఆందోళనకారులను అరెస్టు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు.

ఈ కేసుల గురించి న్యాయవాదులను సంప్రదిస్తున్నామని సౌరవ్ పేర్కొన్నారు. తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కేంద్రానికి మరోసారి గుర్తు చేస్తున్నట్లు తెలిపారు. రేపటిలోగా దేశవ్యాప్తంగా ఆందోళనకారులపై నమోదైన అన్ని కేసులు ఉపసంహరించుకోవాలని.. నిర్బంధంలో ఉన్న నిరసనకారులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే తమ తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు.

**బిహార్‌లో ఏకే-47 తుపాకులు**

బిహార్‌లో విద్యార్థులు నిరసన చేస్తున్న సమయంలో పోలీసులు వారిపైకి ఏకే–47 తుపాకులతో కాల్పులు జరిపారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఢిల్లీలోనూ విద్యార్థులపై పెలెట్‌గన్‌లు వాడారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం మాట నిలుపుకోదని.. విద్యార్థుల గొంతులను అణచివేసేందుకే వారు తప్పుడు హామీలు ఇచ్చారని విమర్శించారు. కాగా.. జులై 25న 'బిహార్ బంద్' సందర్భంగా జరిగిన ఆందోళనల సమయంలో సివాన్ జిల్లాలో ఓ పోలీసు కానిస్టేబుల్ నిరసనకారులపై ఏకే–47 ఎక్కుపెట్టిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీంతో ఇది వివాదాస్పదమైంది. ఈ క్రమంలోనే సదరు కానిస్టేబుల్‌ను అధికారులు సస్పెండ్ చేశారు.

# లోక్‌సభ వాయిదా..

**ముద్ర, ఢిల్లీ:** విపక్షాల ఆందోళనల నడుమ లోక్‌సభ మంగళవారానికి వాయిదా పడింది. పేపర్ లీకులకు పాల్పడే వారికి కఠిన శిక్షలు విధించేలా 2024 నాటి ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్ట సవరణ బిల్లు ఇవాళ లోక్‌సభ ముందుకు వచ్చినా.. బిల్లుపై చర్చించడం సాధ్యం కాలేదు. ఓ వైపు విపక్షాల ఆందోళనలు కొనసాగుతుండగానే.. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఇవాళ ఉదయం ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది.

తిరిగి సభ ప్రారంభమైన వెంటనే.. ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సభను అడ్డుకున్నారు. దీంతో మరోసారి స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 5 గంటలకు వాయిదా వేశారు. ఆ తర్వాత కూడా చర్చ చేపట్టకుండా విపక్షాలు అడ్డుకున్నాయి. ఈ క్రమంలో సభను రేపటికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. పేపర్ లీక్ బిల్లు (సవరణ) చర్చకు రాకుండా విపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు విమర్శించారు. ఈ బిల్లుపై సభలో మంగళవారం చర్చించి.. అనంతరం ఓటింగ్ నిర్వహించనున్నారు.

# తెలుగు భక్తులకు కష్టాలు..

**ముద్ర, హైదరాబాద్ :** అప్పుడెప్పుడో ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు అరుణాచలంలో ప్రదక్షిణలు చేయాలని.. మోక్ష మార్గం నుంచి బయటికి రావాలని పిలుపునిచ్చారు. ఆయన చెప్పడమే ఆలస్యం తెలుగు భక్తులు అప్పటినుంచి అరుణాచలానికి క్యూ కడుతున్నారు. చివరికి తమిళ భక్తుల కంటే ఎక్కువగా తెలుగు వాళ్లే అధికంగా అరుణాచలం వెళ్తున్నారు. భక్తుల తాకిడి తట్టుకోలేక కొన్ని సందర్భాలలో గిరిప్రదక్షిణ గంటల తరబడి ఆలస్యం అవుతుంది. దీనిని బట్టి తెలుగు వాళ్ళు అరుణాచలానికి ఏ స్థాయిలో ప్రాధాన్యం ఇస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.



అరుణాచలంలో గిరిప్రదక్షిణ అద్భుతంగా ఉంటుంది. గిరి ప్రదక్షిణ తర్వాత భక్తులు అత్యంత ముఖ్యంగా భావించేది మోక్షమార్గం. ఇందులో నుంచి బయటికి వస్తే.. మోక్షం లభిస్తుందని.. పాపాల నుంచి విముక్తి సాధ్యమవుతుందని భక్తులు నమ్ముతుంటారు. అదే మోక్ష మార్గం అత్యంత ఇరుకుగా ఉంటుంది. ఇందులోంచి బయటికి రావడం అంటే అంత సులభం కాదు. జీవితంలో పడిన కష్టాలకు.. నష్టాలకు.. దుఃఖాలకు.. సుఖాలకు ప్రతీకగా మోక్షమార్గం ఉంటుంది. అందులో నుంచి వచ్చిన తీరును బట్టే మన జీవితం ఆధారపడి ఉంటుందని ప్రవచన కారులు చెబుతుంటారు.

పైగా చాగంటి కోటేశ్వరరావు ఇందులో నుంచి రావడం పూర్వజన్మల సుకృతమని చెప్పడంతో.. తెలుగు భక్తులు ఎక్కువగా మోక్ష మార్గం నుంచి రావడానికి ప్రయత్నాలు చేస్తుంటారు. లావు ఎక్కువగా ఉన్న వ్యక్తులు సైతం మోక్షమార్గం నుంచి బయటికి రావాలని భావిస్తుంటా రు. అయితే ఇప్పుడు ఈ నమ్మకమే భక్తుల ప్రాణాల మీదికి తీసుకొస్తోంది. ఇటీవల రాజ మండ్రికి సంబంధించిన ఒక భక్తుడు మణికుమార్ ఈనెల 24న మోక్షమార్గంలో ఇరుక్కుపోయి చనిపోయాడు. ఆ సంఘటన మర్చిపోకముందే ఏపీ రాష్ట్రానికి చెందిన మరో భక్తురాలు ఇదే తరహాలో మోక్షమార్గంలో చిక్కుకుపోయింది. బయటికి రావడానికి తీవ్రంగా ఇబ్బంది పడింది. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్నవారు బయటకు రావడానికి ప్రయత్నాలు చేశారు. అనేక ప్రయత్నాల తర్వాత ఆమెను సురక్షితంగా బయటికి లాగారు.. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో విస్తృతంగా కనిపిస్తున్నాయి. మోక్షమార్గం అత్యంత ఇరుకుగా ఉంటుంది. సాధ్యమైనంతవరకు లావుగా ఉన్న వ్యక్తులు అందులో నుంచి రావాలని అనుకోకపోవడమే మంచిది. ఎందుకంటే కొన్ని సందర్భాలలో ఊపిరి ఆగిపోయే ప్రమాదం కూడా ఉంది. రాజమండ్రి భక్తుడు మణికుమార్ విషయంలో కూడా ఇదే జరిగింది. అతడు లావుగా ఉండడంతో అందులో నుంచి రాలేకపోయాడు. శ్వాస ఆడక పోవడంతో.. గుండె ఆగి చనిపోయాడు. అందువల్లే మోక్షమార్గంలో నుంచి బయటికి రావాలనే భక్తులు తమ శారీరక స్థితి ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని అక్కడి పూజారులు చెబుతున్నారు.

# పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్యం కనుమరుగు

**ముద్ర డెస్క్:** పాకిస్తాన్ చరిత్రలో సైన్యం ఎప్పుడూ కీలక పాత్ర పోషిస్తుంది. కానీ ఇటీవలి రాజ్యాంగ సవరణలు, ముఖ్యంగా 27వ సవరణ, ఆ ఆధిపత్యాన్ని మరింత అధికారికం, కేంద్రీకృతం చేస్తున్నాయి. ప్రజాస్వామ్య సంస్థలు ఉన్నట్లు కనిపించినా, వాస్తవ అధికారం సైనిక నాయకత్వం చేతుల్లోకి మరింత బలంగా మారుతోంది. ఈ మార్పులు దేశ అంతర్గత రాజకీయాలను మాత్రమే కాకుండా, ప్రాంతీయ భద్రతా వ్యవస్థను ప్రభావితం చేస్తాయి.

**ప్రజాస్వామ్యం సైనిక కేంద్రీకరణ వైపు..**

పాకిస్తాన్‌లో ఎన్నికైన ప్రధాని, మంత్రులు, స్పీకర్లు ఉన్నప్పటికీ, వారి పాత్ర తరచుగా పరిమితంగా ఉంటుంది. సైన్యం దేశ విధానాల్లో, ముఖ్యంగా భద్రతా, విదేశీ వ్యవహారాల్లో నిర్ణయాధికారాన్ని కలిగి ఉండటం కొత్తది కాదు. అయితే ఇటీవలి మార్పులతో ఈ వ్యవస్థ మరింత స్పష్టంగా సైనిక ఆధిపత్యం వైపు మళ్లింది. ఇమ్రాన్ ఖాన్ వంటి ప్రజాదరణ ఉన్న నాయకులు సైన్యంతో ఘర్షణకు దిగినప్పుడు రాజకీయంగా బలహీనపడిన ఉదాహరణలు ఉన్నాయి. ప్రస్తుత నాయకత్వం సైనిక సంస్థలతో సమన్వయంతో ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తోంది. ఫలితంగా పౌర ప్రభుత్వం కీలుబొమ్మగా మారే ప్రమాదం పెరుగుతోంది.

**26వ రాజ్యాంగ సవరణ..**

2025 చివర్లో ఆమోదం పొందిన 26వ రాజ్యాంగ సవరణ కీలక మార్పులు తీసుకువచ్చింది. ఇది చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ అనే కొత్త పదవిని సృష్టించింది. ఈ పదవి ఆర్మీ చీఫ్‌కే చెందుతుంది. ఫలితంగా ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లపై ఏకైక సైనిక నాయకుడి ఆధిపత్యం ఏర్పడింది. గతంలో సేవల మధ్య సమన్వయానికి ఉన్న చైర్మన్ జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ పదవి రద్దయింది. ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ ఈ కొత్త వ్యవస్థలో కేంద్ర బిందువుగా నిలిచారు. 2025 మేలో భారత్–పాకిస్తాన్ సంఘర్షణ తర్వాత ఆయనకు ఫీల్డ్ మార్షల్ హోదా లభించింది. ఇప్పుడు ఇఈఊగా ఆయన అధికార పరిధి మరింత విస్తరించింది.

**అణ్వాయుధ నియంత్రణలో మార్పు..**

అత్యంత ముఖ్యమైన మార్పు అణ్వాయుధ నియంత్రణలో ఉంది. గతంలో నేషనల్ కమాండ్ అథారిటీ కింద ప్రధాని చైర్మన్‌గా ఉండి, పౌర–సైనిక సమన్వయంతో నిర్ణయాలు జరిగేవి. 27వ సవరణతో నేషనల్ స్ట్రాటజిక్ కమాండ్ ఏర్పాటు కాబోతోంది. దీని కమాండర్‌ను ప్రధాని నియమిస్తున్నప్పటికీ, నామినేషన్ ఆర్మీ చీఫ్ సిఫారసుపైనే జరుగుతుంది. ఆపరేషనల్ నియంత్రణ సైనిక హైరార్కీ కిందకు వచ్చింది. ప్రధాని పాత్ర ఎక్కువగా సమాచార స్థాయికి పరిమితం కావచ్చు. ఇది అణ్వాయుధ నిర్ణయాల్లో పౌర పర్యవేక్షణను బలహీనపరుస్తుంది. అణ్వాయుధాల వాడకం, లక్ష్యాలు, ఆపరేషన్ వంటి అంశాలపై సైనిక నాయకత్వం ప్రాధాన్యత పొందుతుంది. ఈ మార్పు ప్రాంతీయ స్థిరత్వంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. అణ్వాయుధ నియంత్రణ ఒకే సంస్థ లేదా వ్యక్తి చేతుల్లో కేంద్రీకృతం కావడం, సంక్షోభ సమయాల్లో నిర్ణయాలు వేగంగా జరగవచ్చు. కానీ అదే సమయంలో తప్పుడు లెక్కలు లేదా ఒత్తిడి కారణంగా ప్రమాదాలు పెరగవచ్చు.

**చైనా–పాకిస్తాన్ సైనిక అనుసంధానం**

పాకిస్తాన్ సైన్యం చైనా సాంకేతికతపై ఎక్కువగా ఆధారపడుతోంది. జేఎఫ్–17, జె–10సి యుద్ధవిమానాలు, క్షిపణులు, డ్రోన్లు, రాడార్, కమాండ్–కంట్రోల్ వ్యవస్థలు వంటివి చైనా సాయంతో అభివృద్ధి చెందాయి. 2025 మేలో జరిగిన ఆపరేషన్ సిందూర్ సమయంలో చైనా ప్లాట్‌ఫామ్‌లు వాడకం, వాటి పనితీరు గురించి చర్చలు జరిగాయి. సాంకేతిక అనుసంధానం పెరగడం వల్ల రెండు దేశాల సైనిక వ్యవస్థల మధ్య ఆపరేషనల్ సమన్వయం పెరుగుతోంది. ఇది భవిష్యత్ సంఘర్షణల్లో పాకిస్తాన్‌కు చైనా మద్దతు మరింత ప్రత్యక్షంగా కనిపించే అవకాశాలను సృష్టిస్తుంది.

**భారత్ అలర్ట్ కావాల్సిందే..**

ఈ పరిణామాలను భారత్ నిశితంగా గమనించాల్సిన అవసరం ఉంది. పాకిస్తాన్‌లో అణ్వాయుధ నియంత్రణ మార్పు, సైనిక కేంద్రీకరణ, చైనా అనుసంధానం ఇవన్నీ దక్షిణాసియా అణు నిరోధక సమతుల్యతను ప్రభావితం చేస్తాయి. సంక్షోభ సమయాల్లో నిర్ణయ ప్రక్రియ వేగవంతం కావచ్చు లేదా అనిశ్చితి పెరగవచ్చు. భారత్ తన సైనిక సామర్థ్యాలు, గూఢచర్యం, దౌత్య చర్యలను బలోపేతం చేసుకోవాలి. అదే సమయంలో ప్రాంతీయ స్థిరత్వం కోసం దౌత్య మార్గాలను కూడా కొనసాగించాలి.

పాకిస్తాన్‌లోని ఈ మార్పులు దేశ అంతర్గత శక్తి సమతుల్యతను మార్చివేస్తున్నాయి. సైన్యం బలోపేతం కావడం దేశ రక్షణకు ఉపయోగపడవచ్చు. కానీ పౌర నియంత్రణ తగ్గడం, అధికారం ఒకే చోట కేంద్రీకృతం కావడం దీర్ఘకాలికంగా ప్రజాస్వామ్య విలువలు, సంస్థలపై ప్రభావం చూపుతాయి. ప్రాంతీయ దేశాలు, ముఖ్యంగా భారత్, ఈ మార్పులను నిరంతరం పరిశీలించి, తగిన వ్యూహాలు రూపొందించుకోవాలి.




# వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్‌కు మరో పతకం

**ముద్ర, ఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్‌లో వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్ మరో పతకం సాధించింది. మహిళల వెయిట్‌లిఫ్టింగ్ 53 కేజీల విభాగంలో జ్ఞానేశ్వరి యాదవ్ రజత పతకం దక్కించుకుంది. స్నాచ్‌లో 88 కేజీలు ఎత్తిన జ్ఞానేశ్వరి.. క్లీన్ అండ్ జెర్క్ 111 కేజీలు మోసి, మొత్తంగా 199 కేజీలతో రెండో స్థానంలో నిలిచింది. ఒనోమే ఒమోలోలా (నైజీరియా) స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. ఆమె మొత్తం 206 కిలోల (స్నాచ్‌లో 93, క్లీన్ అండ్ జర్క్ 113 కిలోలు) బరువును ఎత్తి కామన్వెల్త్ క్రీడల రికార్డును నెలకొల్పింది. కాగా, రెబెకా గ్రౌల్క్స్ (కెనడా, 178 కేజీలు) కాంస్య పతకాన్ని దక్కించుకుంది.




ఈ ఫైనల్‌లో జ్ఞానేశ్వరి.. స్నాచ్, క్లీన్ అండ్ జర్క్ రెండింటిలోనూ ఒక్క ప్రయత్నం కూడా విఫలం కాకపోవడం విశేషం. ఛత్తీస్‌గఢ్‌లోని భోండియా గ్రామానికి చెందిన 23 ఏళ్ల జ్ఞానేశ్వరి యాదవ్ రాష్ట్ర పోలీస్ శాఖలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తోంది. ఆమె తండ్రి ఒకప్పుడు బాడీబిల్డర్. కానీ ఆర్థిక ఇబ్బందుల కారణంగా తన కలలను వదులుకున్నారు. ఆయన ఇప్పుడు ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నారు. జ్ఞానేశ్వరి పతకం సాధించడంతో ఈ కామన్వెల్త్ గేమ్స్‌లో వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్ పతకాల సంఖ్య నాలుగుకు చేరింది. ఇప్పటికే మహిళల విభాగంలో మీరాబాయి చాను స్వర్ణం గెలవగా.. పురుషుల విభాగంలో రిషికాంత సింగ్, ముత్తుపాండి రాజా రజత పతకాలు సాధించారు. ఓవరాల్‌గా భారత్ ఇప్పటి వరకు ఐదు పతకాలు సాధించింది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 28.07.2026
www.mudranews.in | @mudranews



### కళ్ల కలక నివారణకు వెచ్చని కట్టు పెట్టండి

శుభ్రమైన గుడ్డను గోరువెచ్చని నీటిలో ముంచి 10–15 నిమిషాలు కళ్లపై ఉంచండి. ఇది వాపు, నొప్పిని తగ్గించడంలో సహాయపడుతుంది. రోజుకు 3–4 సార్లు చేయండి.



# ఎంజేస్తరో చేయండి..మా 'పెద్ది'ని కాపాడండి

- వైద్యులకు చేతులెత్తి నమస్కరించిన బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ..
- దేవుడున్నాడు, డాక్టర్లున్నారు.. అన్నీ సవ్యంగానే జరుగుతాయి...
- గుండె చెదురొద్దు ధైర్యంగా ఉండండి
- పెద్ది భార్యా పిల్లలు,కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన కేసీఆర్..
- పెద్ది సుదర్శన్ రెడ్డికి అందుతున్న అత్యున్నత చికిత్సపై ఆరా తీసిన అధినేత...
- ప్రపంచ స్థాయి అత్యుత్తమ చికిత్స అందుతున్నది
- కేసీఆర్ గారికి తెలిపిన యశోద డాక్టర్ లు..
- పూర్తి స్థాయి సమాచారం ఇవ్వడానికి మరో 48 గంటలు : డాక్టర్లు



**ముద్ర, హైదరాబాద్ :** తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న పార్టీ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడానికి సికింద్రాబాద్ యశోదా దవాఖానకు చేరుకున్న బి ఆర్ ఎస్ అధినేత కేసీఆర్ గారు, అందుతున్న చికిత్స గురించి డాక్టర్లతో వాకబు చేశారు.పెద్ది సుదర్శన్ రెడ్డి కి చికిత్స అందుతున్న ఐసీయూ వార్డుకు చేరుకొని, డాక్టర్లతో కలిసి అక్కడ పెద్దికి అందుతున్న చికిత్స విధానాన్ని పరిశీలించారు. ఐసీయూలో ఉన్న ఉద్యమ సహచరుడిని చూసి కేసీఆర్ భావోద్వేగానికి లోనయ్యారు. దాదాపు అరగంట సేపు అక్కడే నిలుచుని డాక్టర్లతో చికిత్స అందుతున్న తీరును గురించి క్షుణ్ణంగా ఆరా తీశారు.

కాగా పెద్ది సుదర్శన్ రెడ్డికి ప్రపంచ స్థాయి అత్యున్నత చికిత్సను అందిస్తున్నామని, అవసరమైన మేరకు విదేశాల నుంచి కూడా డాక్టర్లతో కన్సల్టెన్సీ తీసుకుంటున్నామని డాక్టర్లు తెలిపారు. గుండె ఊపిరితిత్తులు మిగతా అవయవాలు అన్ని పనిచేస్తున్నాయని కాకపోతే కొంత బ్రెయిన్ ఇంకా పునరుత్తేజం చెందాల్సి ఉన్నదని అందుకు మరో 48 గంటలు సమయం పట్టే అవకాశం ఉన్నదని డాక్టర్లు వివరించారు. ఇటువంటి పరిస్థితుల్లో పూర్తి స్థాయిలో స్పష్టమైన నిర్దిష్ట సమాచారం ఇవ్వడానికి మరికొంత సమయం పడుతుందని తెలిపారు. కాగా.. ఖర్చుకు వెనకాడకుండా పెద్ది సుదర్శన్ రెడ్డిని కాపాడుకోవడానికి పార్టీ శాయశక్తులా కృషి చేస్తుందని కేసీఆర్ స్పష్టం చేశారు. ఐసీయూలో వైద్య చికిత్స విధానాన్ని పరిశీలించిన అనంతరం, కుటుంబ సభ్యుల వద్దకు చేరుకున్న కేసీఆర్, వారికి భరోసాను, ధైర్యాన్ని అందించారు. డాక్టర్ల కృషితో, దేవుని దయతో, ప్రజల ఆశీర్వాదంతో ఆయన కోలుకుంటాడని కెసిఆర్ విశ్వాసాన్ని ప్రకటించారు.

ఆందోళన చెందవద్దని భార్యాపిల్లలకు కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చి గుండె ధైర్యం నింపారు. అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తామని కుటుంబ సభ్యులకు ఓదార్పునిచ్చారు. దాదాపు 45 నిమిషాల పాటు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన కేసీఆర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ... "మీరేం చేస్తారో చేయండి..కానీ మా పెద్ది సుదర్శన్ రెడ్డిని కాపాడండి" అంటూ డాక్టర్లకు కేసీఆర్ చేతులెత్తి నమస్కరించారు. కాగా.. అమెరికా తదితర విదేశాల నుంచి డాక్టర్లతో మాట్లాడుతూ అవసరమైన సలహాలు తీసుకుంటూ అత్యున్నత స్థాయి సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వ్యవస్థలతో, సీనియర్ డాక్టర్లతో చికిత్సను అందిస్తున్నామని డాక్టర్లు తెలిపారు. తమ శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని, దావఖాన డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి, ఎండి ఏఎస్ రావు జెవిస్ రావు భరోసా ఇచ్చారు.

ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులు... భార్య స్వప్న, కొడుకు నిదర్శన్ రెడ్డి, కూతురు ధర్మిష్ట, అన్నలు శ్రీనివాసరెడ్డి రవీందర్ రెడ్డి, చెల్లె స్వాతి తదితరులతో మాట్లాడిన కేసీఆర్ వారికి ధైర్యాన్ని భరోసాను నింపారు.

ఈ సందర్భంగా కెసిఆర్ తో పార్టీ ముఖ్యులు మాజీ మంత్రులు హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, రాజయ్య, వేముల ప్రశాంత్ రెడ్డి, సత్యవతి రాథోడ్,పద్మారావు గౌడ్,వినోద్ కుమార్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ సంజయ్, పార్టీ నాయకులు గ్యాదరి బాలమల్లు, సతీష్ రెడ్డి, రజిని సాయి చంద్, పల్లె రవికుమార్, రాజాం యాదవ్, వాసుదేవరెడ్డి, గజ్జెల నగేష్, చిరుమల్ల రాకేష్, ఎర్రోళ్ల శ్రీనివాస్, శ్రీనివాస్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భుజానికి గాయం



**ముద్ర, హైదరాబాద్ :** ప్రముఖ నటుడు ఎన్టీఆర్ గాయపడ్డారు. సోమవారం సాయంత్రం భుజానికి స్వల్ప గాయమైనట్లు ఆయన కార్యాలయం తెలిపింది. డా.జె.మధుసూదన్ రావు, డా.ఆర్ .ఎ. పూర్ణచంద్ర తేజస్వి నేతృత్వంలోని బృందం పూర్తిస్థాయి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించింది. ఎన్టీఆర్ పూర్తిగా కోలుకునేందుకు 6–8 వారాల విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించినట్లు తెలిపింది. అభిమానులు, శ్రేయోభిలాషులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ఎన్టీఆర్ ఆరోగ్యానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తామని పేర్కొంది.

## తీగలగుట్ట ఆర్ఓబీ పనులు వేగవంతం చేయండి

- కలెక్టర్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆదేశాలు
- సర్వీస్ రోడ్లు, భూసేకరణ, డ్రెయినేజీ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచన



**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ సమీపంలోని తీగలగుట్ట రైల్వే ఓవర్‌బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రతిరోజూ కరీంనగర్–చొప్పదండి ప్రధాన రహదారిపై ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నిర్మాణానికి సంబంధించిన అన్ని పనులు ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, ఆర్అండ్‌బీ, రైల్వే అధికారులకు సూచించారు.ఆర్ఓబీకి అనుబంధంగా నిర్మించాల్సిన సర్వీస్ రోడ్లు, భూసేకరణ, డ్రెయినేజీ తదితర పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఇప్పటికే గుత్తేదారు, ఇంజినీరింగ్ అధికారులకు పనుల్లో ఆలస్యం జరగకుండా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. సేతు బంధు పథకం కింద ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.154 కోట్ల నిధులు మంజూరు చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సిన భూసేకరణ ప్రక్రియ ఆలస్యం కావడంతో పనులు ఆశించిన వేగంతో ముందుకు సాగలేదని సమాచారం. అలాగే వంతెనకు ఇరువైపులా నిర్మించాల్సిన సర్వీస్ రోడ్లు, డ్రెయినేజీ పనులు కూడా జాప్యం కావడంతో మూడు నెలల క్రితం ప్రత్యేకంగా సర్వీస్ రోడ్ల నిర్మాణానికి కేంద్ర మంత్రి అదనపు నిధులు కేటాయించారు.గత సమీక్ష సమావేశంలోనే వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేయాలని ఆదేశించినప్పటికీ పురోగతి ఆశించిన స్థాయిలో లేకపోవడంతో స్థానికులు తమ సమస్యలను బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని ఆయన జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను కోరారు.

ఈ నేపథ్యంలో సోమవారం కలెక్టర్ చిత్రా మిశ్రా తీగలగుట్ట ఆర్ఓబీ నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. పనులు వేగంగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణం కొనసాగుతున్న సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు, అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.కాగా తీగలగుట్ట ఆర్ఓబీ నిర్మాణ పురోగతిపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఇప్పటికే పలుమార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ ఏడాది చివరి నాటికి ఆర్ఓబీని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఆయన ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. వంతెన పూర్తయితే కరీంనగర్–చొప్పదండి మార్గంలో ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గడంతో పాటు వేలాది మంది వాహనదారులకు ఉపశమనం కలిగే అవకాశం ఉంది.

# విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు

- ఉచితాలు కావు... ప్రజా పెట్టుబడులు
- అర్ధాకలితో ఏ బిడ్డ బడికి వెళ్లొద్దు
- సానబెట్టిన వజ్రాల్లా మానవ వనరులు
- పాలన అంటే పెత్తనం కాదు... సమాజ హితం
- 'పీపుల్స్ మార్చ్' నుంచే ప్రజాహిత ఇందిరమ్మ పథకాలు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క





**ముద్ర, ఖమ్మం :** ఉచిత పథకాలు అనేవి ఉచితాలు కాదని, ప్రజలపై ప్రభుత్వం చేస్తున్న పెట్టుబడులేనని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేస్తున్న ఖర్చు భవిష్యత్తులో సమాజానికి లాభం చేకూరుస్తుందని పేర్కొన్నారు. మధిరలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషకాహార అల్పాహారం అందించే సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను ప్రారంభించిన ఆయన, రాష్ట్రంలో ఏ బిడ్డా అర్ధాకలితో బడికి వెళ్లకూడదన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. విద్యార్థుల శారీరక, మానసిక వికాసం కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత అల్పాహార పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు.మానవ వనరులే రాష్ట్రానికి నిజమైన సంపద అని, విద్యార్థులను సానబెట్టిన వజ్రాల్లా తీర్చిదిద్దడమే ప్రభుత్వ సంకల్పమని భట్టి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు ఒకేసారి వేడి అల్పాహారం అందించడం దేశ చరిత్రలోనే అరుదైన కార్యక్రమమని అన్నారు.

హరే కృష్ణ మిషన్ భాగస్వామ్యంతో ఆధునిక కిచెన్ల ద్వారా శుభ్రంగా ఆహారం పంపిణీ చేస్తున్నామని, త్వరలో రాష్ట్రవ్యాప్తంగా శాశ్వత కిచెన్లు పూర్తి చేస్తామని చెప్పారు. వారానికి మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగి జావ కూడా అందిస్తున్నట్లు వెల్లడించారు.పాలన అంటే పెత్తనం కాదని, సమాజ హితం కోసం వనరులను వినియోగించడమే నిజమైన పాలన అని భట్టి అన్నారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ప్రజల సమస్యలను చూసి రూపొందించిన ఆలోచనలే నేడు ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత అల్పాహారం వంటి సంక్షేమ పథకాలుగా మారాయని చెప్పారు.

ఇప్పటికే తొలి విడతలో రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లకు మంజూరు చేశామని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.67 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని తెలిపారు. ఆరోగ్య బీమా పరిమితిని రూ.10 లక్షలకు పెంచడంతో పాటు, కోటి 6 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, రైతు భరోసా కింద కేవలం 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు.

## నీట్ నిరసనలపై బండి సంజయ్ స్పందించాలి

- బండి మాటలు కోటలు దాటుతాయి కానీ యువకులపై జరిగిన దాడిపై మాట్లాడరు
- చిత్తశుద్ధి ఉంటే యువశక్తి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రతిపాదనలు అమలయ్యేట్టు చూడాలి
- ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను ఆదుకోవాలి,కేసులు ఎత్తివేయాలి
- పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇస్తామని మోసం చేశారు
- మాజీ సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఫైర్




**ముద్ర, కరీంనగర్ :** కేంద్ర విద్యాశాఖ నిర్వహించిన నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీక్ వ్యవహారంపై నిరసన తెలిపిన యువతపై పోలీసుల చర్యలను మాజీ సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. నీట్ ప్రశ్నాపత్రాల లీక్ కారణంగా విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేస్తూ శాంతియుతంగా ధర్నా చేపట్టిన యువకులు, యువతులపై బాష్పవాయువు, లాఠీచార్జ్, పెల్లెట్ గన్స్‌తో దాడులు చేయించడం వల్ల వందలాది మంది గాయపడిన ఘటనపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ యువతకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. యువతను ఆవేశపూరిత ప్రసంగాలతో రెచ్చగొట్టి రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం కాదని, యువత న్యాయం కోసం పోరాడుతున్నప్పుడు వారికి అండగా నిలిచి చిత్తశుద్ధిని ప్రదర్శించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ఈ ఘటనల నేపథ్యంలో యువత కూడా వాస్తవాలను గుర్తించి ఆలోచించాలని సూచించారు. అలాగే ప్రతి చిన్న అంశానికీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు కూడా కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ప్రశ్నలు సంధించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రశ్నాపత్రాల లీక్‌లు, పోటీ పరీక్షల రద్దులు వరుసగా జరిగినప్పటికీ నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించే దిశగా ఎప్పుడైనా చిత్తశుద్ధితో పనిచేశారా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించినట్లుగా 21 ఏళ్లకే యువతకు చట్టసభల్లో పోటీ చేసే అవకాశం కల్పించేలా చట్ట సవరణకు బిల్లు తీసుకురావాలని, నీట్ నిరసనల్లో పాల్గొన్న యువతపై నమోదు చేసిన క్రిమినల్ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు తాజొద్దీన్,గుండాటి శ్రీనివాస్ రెడ్డి,జీడి రమేష్,ఎల్లారెడ్డి,మిర్యాల శ్రీధర్ రెడ్డి,షబానా మహమ్మద్ షెహన్నా,సాయిరాం,ముల్కల యోన,మాసుం ఖాన్,జిలుకర రమేష్,బత్తుల రాజ్ కుమార్, ఇమామ్,ఖలీల్ తదితరులు పాల్గొన్నారు

## వారణాసిలో ఘోరం

- ప్యాంట్‌లో మూత్రం పోసుకున్నాడని దారుణం..
- బాలుడి ప్రైవేట్ పార్ట్ కాల్చిన టీచర్!

**ముద్ర, ఢిల్లీ :** ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఓ ప్లే స్కూల్‌లో ఐదేళ్ల బాలుడిపై మహిళా ఉపాధ్యాయురాలు అమానుషంగా ప్రవర్తించిన ఘటన కలకలం రేపింది. వాష్‌రూమ్‌కు వెళ్లేందుకు అనుమతి ఇవ్వకపోవడంతో బాలుడు ప్యాంట్‌లో మూత్రం పోసుకోవడంతో, అతడిని మరో గదికి తీసుకెళ్లి కొట్టి, వేడి కత్తితో ప్రైవేట్ పార్ట్‌ను కాల్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంటికి వచ్చిన బాలుడు నొప్పితో విలవిల్లాడడంతో తల్లిదండ్రులు విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మెడికల్ రిపోర్టుల ఆధారంగా పోలీసులు ఉపాధ్యాయురాలు, ఘటనను కప్పిపుచ్చేందుకు ప్రయత్నించిన ప్రిన్సిపాల్‌పై పోక్సోతో పాటు సంబంధిత చట్టాల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతుండగా, స్కూల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి..

## నగునూరు.. కేరాఫ్ కాకతీయ శిల్ప వైభవం



**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ జిల్లా కేంద్రానికి సమీపంలోని నగునూరు గ్రామం, కాకతీయుల శిల్పకళా వైభవానికి చిరునామాగా నిలిచింది. ఒకప్పుడు నాలుగు వందల ఆలయాల గ్రామంగా పేరుగాంచిన ఈ ప్రాంతం, ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్నప్పటికీ తన చారిత్రక ప్రాధాన్యాన్ని చాటుతోంది. 12, 13వ శతాబ్దాల్లో కాకతీయుల పాలనలో నగునూరు ప్రముఖ ఆధ్యాత్మిక, శిల్పకేంద్రంగా అభివృద్ధి చెందింది. రుద్రదేవుని కాలంలో వెల్లకి గంగాధరుడు నిర్మించిన త్రికూటాలయం ఇక్కడి ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

కల్యాణి చాళుక్య, కాకతీయ శైలుల సమ్మేళనంగా నిర్మితమైన ఆలయాలు ఎర్రరాతితో నిర్మించబడి, స్తంభాలపై నర్తకులు, వాద్యకారులు, పురాణ ఘట్టాల శిల్పాలతో అలరింపజేస్తాయి. ఇవి కాకతీయుల కళా నైపుణ్యానికి నిదర్శనం.

గ్రామంలో ఇళ్లు, రహదారుల నిర్మాణ సమయంలో నంది విగ్రహాలు, శిల్ప భాగాలు, ఆలయ అవశేషాలు తరచూ బయటపడుతుండటంతో ఇంకా అనేక కట్టడాలు నేలలో దాగి ఉన్నాయని పరిశోధకులు భావిస్తున్నారు. ఈ వైభవం హంపిని తలపించినా, నగునూరుకు ఇంకా తగిన పరిరక్షణ లభించలేదు.ప్రస్తుతం సహజ శిథిలావస్థతో పాటు గుప్తనిధుల కోసం జరిగే అక్రమ తవ్వకాలు ఈ వారసత్వానికి ముప్పుగా మారాయి. అందువల్ల ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా లేదా తెలంగాణ పురావస్తు శాఖ సమగ్ర సర్వే నిర్వహించి, ఈ ప్రాంతాన్ని రక్షిత పురావస్తు క్షేత్రంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. నగునూరు కేవలం శిథిలాల సమూహం కాదు.. తెలంగాణ చరిత్ర, కాకతీయుల కళా వైభవానికి సజీవ సాక్ష్యం.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
మంగళవారం 28.07.2026



మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# ప్రథమ చికిత్స

## ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన 10 ముఖ్య విషయాలు

ప్రమాదం లేదా అకస్మాత్ అనారోగ్యం సంభవించిన వ్యక్తికి వైద్యులు లేదా ఆసుపత్రి సహాయం అందేలోపు ఇచ్చే తక్షణ ప్రాథమిక సహాయం. దీని ప్రధాన ఉద్దేశం ప్రాణాలను కాపాడటం, పరిస్థితి మరింత దిగజారకుండా ఆపడం.. నొప్పిని తగ్గించడం. ఇది అత్యంత అవశ్యం..

**1. రక్తస్రావం**

శరీరంలోని ఏ భాగంలో గాయం అయి రక్తం కారితే వెంటనే శుభ్రమైన గుడ్డతో ఒత్తిడి చేయాలి. రక్తస్రావం తగ్గే వరకు ఆ ఒత్తిడిని కొనసాగించాలి. గాయాన్ని పరిశుభ్రమైన నీటితో కడగాలి. రక్తస్రావం ఎక్కువగా ఉంటే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి.

**2. కాలిన గాయాలు**

కాలిన ప్రాంతాన్ని వెంటనే చల్లటి నీటిలో 10–20 నిమిషాలు ఉంచాలి. మంచు ముక్కలను నేరుగా గాయంపై పెట్టకూడదు. కాలిన చోట పేస్టులు లేదా నూనెలు రాయకూడదు. శుభ్రమైన గాజుతో కప్పి వైద్యుడిని సంప్రదించాలి.

**3. శ్వాస ఆడకపోవడం**

ఆహారం లేదా ఇతర వస్తువు గొంతులో ఇరుక్కుంటే వ్యక్తి దగ్గలేక, మాట్లాడలేక ఇబ్బంది పడతాడు. వెంటనే వెనుక నుంచి నిలబడి పొట్ట భాగంపై ఒత్తిడి చేసే Heimlich పద్ధతి ఉపయోగించాలి. పరిస్థితి మెరుగుపడకపోతే అత్యవసర వైద్య సహాయం పొందాలి. ఆలస్యం చేయడం ప్రమాదకరం.

**4. గుండె ఆగినప్పుడు సీపీఆర్**

వ్యక్తి స్పందించకపోతే, శ్వాస తీసుకోకపోతే వెంటనే CPR ప్రారంభించాలి. ఛాతీ మధ్యభాగంపై బలంగా, వేగంగా ఒత్తిడి చేయాలి. అంబులెన్స్ వచ్చే వరకు కొనసాగించాలి. సరైన CPR ప్రాణాలను కాపాడగలదు.

**5. ఎముక విరిగినప్పుడు**

విరిగిన భాగాన్ని కదపకుండా స్థిరంగా ఉంచాలి. గట్టిగా కట్టడం లేదా బలవంతంగా సరిచేయడం చేయకూడదు. వాపు తగ్గేందుకు ఐస్ ప్యాక్ ఉపయోగించవచ్చు. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి.

**6. మెలికలు, బెణుకులు**

ప్రభావిత భాగానికి విశ్రాంతి ఇవ్వాలి. ఐస్ ప్యాక్‌ను 15–20 నిమిషాలు ఉంచాలి. ఎలాస్టిక్ బ్యాండేజ్‌తో తేలికగా కట్టాలి. కాలు లేదా చేతిని కొంచెం ఎత్తుగా ఉంచడం మంచిది.

**7. కంటి గాయాలు**

కంటిలో దుమ్ము లేదా చిన్న వస్తువు పడితే బలంగా రుద్దకూడదు. శుభ్రమైన నీటితో మెల్లగా కడగాలి. పదునైన వస్తువు గుచ్చుకున్నట్లయితే తాకకూడదు. వెంటనే నేత్ర వైద్యుడిని సంప్రదించాలి.

**8. అపస్మారక స్థితి**

వ్యక్తిని సురక్షిత ప్రదేశంలో పడుకోబెట్టాలి. కాళ్లను కొద్దిగా పైకి ఎత్తాలి. గాలి బాగా వచ్చేలా చూడాలి. కొద్ది నిమిషాల్లో స్పృహ రాకపోతే వైద్య సహాయం పొందాలి.

**9. విషపదార్థాలు తీసుకున్నప్పుడు**

విషం తాగిన వ్యక్తిని బలవంతంగా వాంతులు చేయించకూడదు. ఏ పదార్థం తీసుకున్నాడో తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. వెంటనే అత్యవసర వైద్య సేవలను సంప్రదించాలి. సమయానికి చికిత్స చాలా ముఖ్యం.

**10. ప్రథమ చికిత్స యొక్క ప్రాముఖ్యత**

అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స ప్రాణాలను కాపాడగలదు. సరైన సమయంలో తీసుకున్న చిన్న చర్య పెద్ద ప్రమాదాన్ని నివారిస్తుంది. ప్రతి కుటుంబంలో కనీసం ఒకరికి First Aid పరిజ్ఞానం ఉండాలి. ఇంట్లో ఎప్పుడూ First Aid Kit సిద్ధంగా ఉంచుకోవడం మంచిది.



# మోడీ గేమ్

## అర్థం కాలేదా రాహుల్ గాంధీ

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసనలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా.. ఈ పరిణామాలను చూసి విపక్షాలు సంబరాలు చేసుకుంటున్నాయి. "మోదీ పని అయిపోయింది", "ఇక గద్దె దిగడమే తరువాయి" అంటూ ప్రచారం సాగుతోంది. కానీ రాజకీయాల్లో అనుభవం ఉన్నవారికి ఇది కేవలం ఒక చిన్న పరిణామమే. మూడు పర్యాయాలు గుజరాత్ ముఖ్యమంత్రిగా, మూడు పర్యాయాలు దేశ ప్రధానిగా సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నరేంద్ర మోదీ రాజకీయ వ్యూహాన్ని అర్థం చేసుకోవడంలో విపక్షాలు, ముఖ్యంగా రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ మరోసారి విఫలమైనట్లు కనిపిస్తోంది.

**రాజీనామా.. ఓటమి కాదు..**

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయగానే కాంగ్రెస్ నేతలు దీన్ని తమ విజయంగా చూపించడానికి ప్రయత్నిస్తున్నారు. రాహుల్ గాంధీ జంతర్మంతర్ వద్దకు వెళ్లి, ప్రధాని నివాసం దగ్గర ధర్నా చేసి క్రెడిట్ తీసుకునే ప్రయత్నం చేశారు. కానీ వాస్తవంగా, కాక్రోచ్ జనతా పార్టీ 20 రోజులకు పైగా నిరసనలు సాగించినప్పుడు రాహుల్ గాంధీ అటు వైపు కన్నెత్తి చూడలేదు. సీజేపీ నాయకత్వం కూడా కాంగ్రెస్‌ను పిలవలేదు. లాఠీచార్జ్ తర్వాత మాత్రమే రంగంలోకి దిగిన రాహుల్ గాంధీ, తర్వాత ప్రధాని మోదీ ఇంటి ఎదుట ధర్నా చేసి హడావుడి చేశారు. తరువాతి పరిణామాలతో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. ఆ తర్వాత కూడా సీజేపీ రాహుల్‌ను పట్టించుకోలేదు. మంత్రిని రాజీనామా చేయించడం ద్వారా విద్యార్థుల ఆగ్రహాన్ని తగ్గించి, సమస్యను నియంత్రణలోకి తీసుకువచ్చింది. పదవులు శాశ్వతం కావు అన్న సత్యాన్ని మోదీ బాగా అర్థం చేసుకున్నాడు. ఇది వెనుకడుగు కాదు, సమయానుకూల సర్దుబాటు. విపక్షాలు దీన్ని మోదీ ఓటమిగా చూపించాలని ప్రయత్నిస్తున్నా, రాజకీయ అనుభవం లేని వారికి మాత్రమే ఇది అర్థం కావడం లేదు.





**కాంగ్రెస్ స్వయంకృతాపరాధం..**

కాంగ్రెస్ ప్రస్తుత పరిస్థితికి ప్రధాన కారణం దాని సొంత తప్పిదాలే. గతంలో బీజేపీని ఎదుర్కోవాలని సమాజ్ వాదీ పార్టీని ప్రోత్సహించి ఉత్తరప్రదేశ్‌లో 25 ఏళ్లుగా అధికారానికి దూరమైంది. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీకి మద్దతు ఇచ్చి, కేజ్రీవాల్‌ను సీఎం చేసి, ఫలితంగా ఢిల్లీలో కాంగ్రెస్ కనుమరుగు అయింది.. 20 ఏళ్లుగా అక్కడ అధికారం దక్కలేదు. ఇలా అనేక ప్రాంతీయ పార్టీలను పెంచి పోషించడం వల్ల కాంగ్రెస్ అనేక రాష్ట్రాల్లో బలహీనపడింది.

**రెండుసార్లు ప్రతిపక్ష హోదా దక్కలే..**

2024 ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా సాధించినా సొంతంగా 100 సీట్లు కూడా గెలవలేకపోయింది. వందేళ్ల చరిత్రలో 2014, 2018 పార్లమెంట్ ఎన్నికల్లో రెండుసార్లు కనీసం ప్రతిపక్ష స్థానం కూడా కోల్పోయిన పార్టీ ఇది. బీజేపీ వ్యతిరేక శక్తులను ఏకం చేద్దామనుకున్న కాంగ్రెస్, రోజురోజుకు బలహీనపడుతూ ప్రాంతీయ పార్టీలకు మార్గం సుగమం చేస్తోంది.

**సీజేపీ.. కొత్త ప్రత్యామ్నాయం?**

ఇప్పుడు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసనలకు కాంగ్రెస్ చప్పట్లు కొడుతోంది. కానీ సీజేపీ రాహుల్ గాంధీని పట్టించుకోకపోవడం విశ్లేషకులకు ఆసక్తికరంగా కనిపిస్తోంది. యువత ఆధారిత ఈ ఉద్యమం కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదుగుతోందని అంటున్నారు. బీజేపీ వ్యతిరేక ఓటును సమీకరించాలనుకున్న కాంగ్రెస్, మరోసారి తన స్థానాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది.

మోదీ రాజకీయాలు సాధారణం కాదు. ఒక సవాలును అవకాశంగా మార్చుకునే నైపుణ్యం ఆయనకు ఉంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ద్వారా ప్రభుత్వం బాధ్యత తీసుకున్నట్లు చూపించి, విద్యా వ్యవస్థలో సంస్కరణల దిశగా అడుగులు వేయవచ్చు. విపక్షాలు దీన్ని మోదీ పతనంగా చూస్తే, మోదీ మాత్రం దీనిని తన పటిష్టతను నిరూపించే అవకాశంగా మార్చుకొనే అవకాశం ఉంది. మోదీ గేమ్‌ను అర్థం చేసుకోవడంలో విఫలమైనంత కాలం, విపక్షాలు ఇలాంటి విజయాలతోనే సంతృప్తి చెందుతూ ఉండాలి.

# దేశవ్యాప్తంగా మరో ఉద్యమం..

సుప్రీంకోర్టు న్యాయమూర్తి చేసిన కాక్రోచ్ వ్యాఖ్యల నుంచి పుట్టుకొచ్చిన కాక్రోచ్ జనతా పార్టీ ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. మొన్నటి వరకు సోషల్ మీడియా వేదికగా ఉద్యమించిన సీజేపీ నీటి ప్రశ్నపత్రం లీకేజీ, విద్యా వ్యవస్థలో లోపల పై ప్రత్యక్ష ఆందోళన చేపట్టింది. ఏకంగా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా లక్ష్యంగా ఢిల్లీలో జంతర్మంతర్ వద్ద నిరసనకు దిగింది. 20 రోజుల పైగా సాగిన ఉద్యమంతో విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇదే స్ఫూర్తితో ఇప్పుడు మరో ఉద్యమం మొదలయ్యే అవకాశం కనిపిస్తుంది. ఇన్ స్టాగ్రామ్ లో అకస్మాత్తుగా పెరిగిన Reservation Hatao Andolan (RHA) యువత దృష్టిని ఆకర్షిస్తోంది. కుల ఆధారిత రిజర్వేషన్‌లో మార్పులు, మెరిట్, ఆర్థిక అవసరాల ఆధారంగా అవకాశాలు కావాలని కోరుతూ ఇది వేగంగా వ్యాపిస్తోంది. ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని స్పష్టం చేస్తూ, పౌరుల నేతృత్వంలోని ఉద్యమంగా తమను తాము రూపు దిద్దుకుంటోంది.

**ఆర్ హెచ్ ఏ ఉద్యమం ఆవిర్భావం..**

ఇటీవలి విద్యార్థి నిరసనల (పరీక్షల లీక్‌లు వంటి సమస్యలపై) తర్వాత ఈ ఇన్ స్టాగ్రామ్ పేజీ ఫాలోయింగ్ అకస్మాత్తుగా పెరిగింది. కొన్ని గంటలు/రోజుల్లోనే లక్షల మంది ఫాలోవర్లను చేరుకోవడం వైరల్ అయింది. యూజర్ ప్రకారం 34 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. ఇది ప్రధానంగా జెన్ జెడ్, సాధారణ కేటగిరీ విద్యార్థుల మధ్య చర్చను రేకెత్తించింది. "సమానత్వం, మెరిట్, న్యాయం" వంటి నినాదాలతో ఇది ఆన్‌లైన్‌లో వేగంగా వ్యాపిస్తోంది.

**ప్రధాన డిమాండ్లు ఇవీ..**

ప్రస్తుత కుల ఆధారిత కోటాలను (విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో) సమీక్షించాలని లేదా తొలగించాలని కోరుతూ, మెరిట్, నైపుణ్యం, ఆర్థిక అవసరాల ఆధారంగా అవకాశాలు కావాలని వాదిస్తోంది. కులం బదులు నిజమైన పేదరికం ఆధారంగా సహాయం, అధికారిక ఫారమ్‌లలో కుల ప్రకటనలు తగ్గించడం వంటి అంశాలు ముందుకు వస్తున్నాయి. ఒక తరం/కుటుంబానికి పరిమితం చేయడం లేదా క్రీమీ లేయర్‌ను మరింత కఠినంగా అమలు చేయడం వంటి సంస్కరణలు కూడా చర్చలో ఉన్నాయి.

**ఎందుకు ఇంత ప్రాచుర్యం?**

విద్యా అవకాశాల్లో అసమాన కట్–ఆఫ్‌లు, క్రీమీ లేయర్ సమస్యలు, కులం ఇంకా అధికారికంగా కొనసాగడం వంటి అంశాలపై యువతలో నిరాశ కనిపిస్తోంది. సోషల్ మీడియా ద్వారా త్వరగా వ్యాపించే సామర్థ్యం, రాజకీయ పార్టీల నుంచి దూరంగా ఉండాలనే ప్రకటన దీనికి ప్రాచుర్యం తెచ్చాయి. అయితే ఇలాంటి ఆన్‌లైన్ ఉద్యమాలు తరచూ భావోద్వేగంతో పెరుగుతాయి. నిజమైన సామాజిక మార్పుకు ఆఫ్‌లైన్ చర్చలు, విస్తృత సంప్రదింపులు అవసరం.

**మద్దతుతోపాటు విమర్శలు..**

రిజర్వేషన్ కుల స్పృహను కొనసాగిస్తుందని, మెరిట్‌ను బలహీనపరుస్తుందని, ఆర్థికంగా బాగా ఉన్నవారికి కూడా ప్రయోజనం చేకూరుస్తుందని అంటారు. ఆర్థిక ఆధారిత వ్యవస్థ మరింత సమానమని వాదిస్తున్నారు 1950ల నాటి వ్యవస్థను సమీక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే సమయంలో చారిత్రక అన్యాయాలు, నేటికీ కొనసాగుతున్న వివక్ష, ప్రాతినిధ్య అవసరం వంటి కారణాలతో రిజర్వేషన్ అవసరమన్న వాదన ఉంది. రిజరేషన్లు అకస్మాత్తుగా తొలగిస్తే అసమానతలు పెరగవచ్చని పేర్కొన్నారు. కులం ఆధారిత సమస్యలు పూర్తిగా అంతం కాలేదనే వాదన ఉంది. ఇంకోవైపు రెండు వైపులా చెల్లుబాటు అయ్యే అంశాలు ఉన్నాయి. రిజర్వేషన్ లక్ష్యం సామాజిక న్యాయం, కానీ అమలులో సమస్యలు, కాలక్రమేణా మార్పుల అవసరం.

**ఉద్యమం ముందు సవాళ్లు..**

ఇలాంటి ఉద్యమాలు రాజకీయాల్లోకి లాగబడే ప్రమాదం ఉంది. రాజ్యాంగ సవరణలు, న్యాయస్థానాల పరిశీలన, విస్తృత సామాజిక సమ్మతి లేకుండా పెద్ద మార్పులు కష్టం. ఆర్థిక ప్రమాణాలను బలోపేతం చేయడం, విద్యా నాణ్యతను పెంచడం, క్రీమీ లేయర్‌ను సమర్థవంతంగా అమలు చేయడం వంటి మధ్యమార్గాలు ఎక్కువ చర్చనీయాంశాలు కావచ్చు.

ఆర్‌హెచ్‌ఏ సోషల్ మీడియా ద్వారా యువతలోని నిరాశను ప్రతిబింబిస్తోంది. ఇది రిజర్వేషన్ విధానం గురించి తాజా చర్చను రేకెత్తించింది. అయితే నిజమైన పరిష్కారం ఒక పక్షం వాదనలపై కాకుండా, డేటా, సామాజిక వాస్తవాలు, రాజ్యాంగ సూత్రాల ఆధారంగా సమతుల్యమైన సంస్కరణల్లో ఉంటుంది.

## తెలంగాణలో ఈ చెరువే

# దేశానికి ఆదర్శం

గోదావరి కిందికి పోతుంటే పైకి తీసు కొచ్చాం. వందల మీటర్లు గ్రావిటీకి వ్యతిరేకంగా ప్రవహించేలా చేశాం. లక్ష ల ఎకరాలకు నీళ్లు ఇచ్చాం. తాగు నీటి అవసరాలు తీర్చాం. సాగునీటి అవసరాలు తీర్చాం. దేశానికే కొత్త మోడల్ తీసుకొచ్చాం. ఇదే కదా కాళేశ్వరం విషయంలో గులాబీ పార్టీ చెప్పేది.

వాళ్ల సొంత ప్రచారం.. ఇతర వ్యవహారాలను పక్కనపెడితే.. ఇవాల్టికి తెలంగాణకు బలం గొలుసుకట్టు చెరువులు. కాకతీయులు ని ర్మించిన గొలుసుకట్టు చెరువుల వల్ల తెలం గాణలో సాగు నిలబడింది. పంటలు పండడానికి ఆస్కారం ఏర్పడింది. ప్రజల కడుపు నిండింది. పశువులకు దప్పిక తీరింది. ఈ రోజుకు కూడా.. ఇంతటి ఆధునిక కాలం లో.. తెలంగాణ రాష్ట్రం ఒక అన్నపూర్ణగా నిలుస్తోంది.. దేశానికి పట్టెడు అన్నం పెడు తుంది అంటే దానికి ప్రధాన కారణం గొలుసుకట్టు చెరువులు.

గొలుసుకట్టు చెరువుల్లో ఈ చెరువు ది ప్రత్యేకమైన స్థానం. ఒక రకంగా తెలంగాణకు మాత్రమే కాదు.. యావత్ దేశానికే ఆద ర్శం.. ఉమ్మడి మెదక్ జిల్లాలో బషీరాబాద్ మండలం మైల్వార్ అనే గ్రామం ఉంది. ఇక్కడ ఎల్లమ్మ చెరువు సుప్రసిద్ధమైనది. ఇక్కడ రైతులు మొదటి నుంచి కూడా నీటి పదవులు పాటిస్తూ ఉంటారు. ఈ గ్రామం శివారు ప్రాంతంలో సుమారు 80 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంది. దీని కింద 250 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. అయితే ఈ భూమి పరిధిలో ఉన్న ఏ ఒక్క రైతు కూడా చెరువు నీటిని నేరుగా వినియోగించుకోరు. తూములు ఉపయోగించరు. కాలువలలో కూడా నీటిని వాడరు.

ఇలా నీటిని వాడితే 50% వరకు వృధా అవుతుందని రైతులు భావిస్తుంటారు. అందువ ల్లే ఇక్కడి రైతులు కేవలం బోర్ల ద్వారా మా త్రమే పంట పొలాలు సాగు చేస్తుంటారు. ఈ చెరువులో నీటిని అలాగే ఉంచుతారు. ఈ చెరువు కింద దాదాపు 40 వరకు బోర్లు ఉన్నాయి. చెరువు నీటిని అలానే ఉంచడం వల్ల ఇక్కడ భూగర్భ జలాల మట్టం పెరిగిం ది. కొన్ని సంవత్సరాల క్రితం ఇక్కడ పది అడుగుల లోతరించే భూగర్భ జలాలు ఉన్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కరువు ఉన్నప్పటికీ.. ఇక్కడ మాత్రం బోర్లు సమృ ద్ధిగా పోస్తున్నాయి. రైతులు కూడా పంట లు సాగు చేస్తున్నారు. ఇక్కడ రైతులు వరి సాగులో నిమగ్నమై ఉన్నారు. చెరువులో నీటిని ఇక్కడ రైతులు నీటి బ్యాంక్ లాగా మార్చడం వల్లే ఘనతను సాధిస్తున్నారు.



ఈ చెరువు నీళ్లపల్లి.. మైల్వార్ రిజర్వ్ ఫారెస్ట్ కు దగ్గరగా ఉంటుంది. అందువల్లే ఇక్కడ నీళ్లు అడవి జంతువులకు ప్రాణాదారంగా ఉంటాయి. ఇక్కడ చెరువులో నీళ్లు కాలాల తో సంబంధం లేకుండా మూగజీవాలు ఇక్కడికి వస్తుంటాయి. కేవలం పంటలు పండడమే కాకుండా.. మూగ జీవాలకు కూడా ఈ చెరువు ఆధారంగా ఉంటుంది. అయితే తెలంగాణ రాష్ట్రం మొత్తం ఇటువం టి విధానాలను కనుక రైతులు పాటించగలిగితే కచ్చితంగా ఎటువంటి కరువు పరిస్థితులు వచ్చినప్పటికీ ఇబ్బంది ఉండదని వ్యవసాయ శాఖ అంటున్నారు.

# రేవంత్ పై కేటీఆర్ లీగల్ ఫైట్

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన చర్చగా మారుతున్నాయి. దీంతో అసలు ఆరోపణలకే మరింత ప్రచారం లభిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రేవంత్ రెడ్డి కూడా "దర్యాప్తుకు సిద్ధం", "విచారణ జరిపిద్దాం" అంటూ అదే అంశాలను మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని, ఈ పరిణామం బీఆర్ఎస్‌కు రాజకీయంగా ఇబ్బందికరంగా మారుతోందని కొందరు విశ్లేషకులు పేర్కొంటున్నారు.

పాలిటిక్స్‌లో లీగల్ వ్యూహం సరిపోతుందా?

మాజీ ఐటీ మంత్రిగా పరిపాలనలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కేటీఆర్, చట్టపరమైన ప్రక్రియల ద్వారా తనపై వచ్చిన ఆరోపణలను ఎదుర్కోవాలని భావించడం సహజమే. అయితే తెలంగాణ వంటి తీవ్ర రాజకీయ పోటీ ఉన్న రాష్ట్రంలో కోర్టు నోటీసుల కంటే ప్రజాక్షేత్రంలోనే ప్రత్యర్థిని రాజకీయంగా నిలదీయడం నాయకత్వ లక్షణంగా భావించే వర్గాలు కూడా ఉన్నాయి.

రేవంత్ రెడ్డి లేవనెత్తుతున్న ప్రతి అంశంపై ఆధారాలతో ప్రజల ముందుకు వెళ్లి బహిరంగంగా వివరణ ఇవ్వడం, ప్రత్యర్థి ఆరోపణలను రాజకీయంగానే తిప్పికొట్టడం ద్వారా కేడర్‌లో మరింత ఆత్మవిశ్వాసం పెంచవచ్చని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే మరోవైపు, వ్యక్తిగత పరువుకు భంగం కలిగించే లేదా నిరాధార ఆరోపణలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం ప్రతి ప్రజాప్రతినిధికి ఉన్న హక్కేనని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఇలా చూస్తే, కేటీఆర్ ఎంచుకున్న లీగల్ నోటీసుల వ్యూహం చట్టపరంగా సమర్థనీయమైనదైనా, రాజకీయంగా ఎంతవరకు ప్రయోజనం చేకూరుస్తుందన్నది రానున్న రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో మరింత ఆసక్తికర చర్చగా మారే అవకాశముంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 28.07.2026
www.mudranews.in | @mudranews



**కళ్ల కలక నివారణకు**

కళ్లను రుద్దవద్దు. కలక ఉన్నప్పుడు కళ్లను గట్టిగా రుద్దడం వల్ల ఇబ్బంది పెరుగుతుంది. దీంతో ఇన్ఫెక్షన్ ఇతర భాగాలకు వ్యాపించే అవకాశం ఉంటుంది. కళ్లకు విశ్రాంతి ఇవ్వండి.



# అంగవైకల్యం అడ్డుకాలేదు..

**రాహుల్ పోలీస్ కావాలన్న కోరిక నెరవేర్చిన సీపీ సుమతి**

**ముద్ర, మల్కాజిగిరి:** పుట్టుకతోనే అంగ వైకల్యంతో నడవలేని స్థితిలో ఉన్న దమ్మాయిగూడకు చెందిన రాహుల్ పోలీస్ అధికారి కావాలన్న చిరకాల కోరికను మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి నెరవేర్చారు. ఒకరోజైనా పోలీస్ అధికారి కుర్చీలో కూర్చోవాలన్న రాహుల్ కోరికను తెలుసుకున్న సీపీ సుమతి, అతడిని కమిషనరేట్ ప్రధాన కార్యాలయానికి ఆహ్వానించి తన కుర్చీలో కూర్చోబెట్టి పోలీస్ టోపీ ధరింపజేశారు. "నీ కోరిక తీరిందా రాహుల్?" అంటూ ఆప్యాయంగా పలకరించగా, రాహుల్ ఆనందంతో చిరునవ్వులు చిందించాడు.ప్రకాశం జిల్లా కందుకూరు నుంచి వలస వచ్చిన తిరుమలరావు–రాధమ్మ దంపతుల కుమారుడైన రాహుల్ పుట్టుకతోనే అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. రెండు కాళ్లు ఉన్నప్పటికీ నడవలేని పరిస్థితితో పాటు



మాటలు కూడా సరిగా మాట్లాడలేని స్థితిలో ఉన్నాడు. రాహుల్ పరిస్థితిని తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు శివకృష్ణ, ప్రతిమ ఫౌండేషన్ చైర్మన్ రష్మిత దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు రాహుల్‌కు వీల్‌చైర్ అందజేసి అండగా నిలిచారు.ఈ సందర్భంగా సీపీ సుమతి మాట్లాడుతూ, అంగవైకల్యంతో బాధపడుతున్న వారికి ప్రతి ఒక్కరూ ప్రేమ, దయ, ఆదరణ చూపాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థలు మరింత ముందుకు వచ్చి దివ్యాంగులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.స్వచ్ఛంద సంస్థలు అంకితభావంతో సేవ చేయాలి: సీపీ సుమతిపేద ప్రజల కోసం స్వచ్ఛంద సంస్థలు అంకితభావంతో, నిస్వార్థంగా సేవలు అందించినప్పుడే ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని సీపీ బడుగుల సుమతి అన్నారు. దివ్యాంగులు, మూగ, చెవిటి తదితర వర్గాల వారిని ఆప్యాయంగా పలకరిస్తూ సోదరభావంతో సేవ చేయాలని ఆమె సూచించారు.సమాజానికి చేరువగా ఉంటూ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థలను సీపీ అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ దామరపల్లి నర్సింహారెడ్డి, చింతల విజయ్‌కుమార్, జినుక రఘు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంకు సీఎం రేవంత్ రెడ్డి నివాళి



**ముద్ర, హైదరాబాద్, జూలై 27:** మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆయనకు ఘన నివాళులర్పించారు. భారత అంతరిక్ష, క్షిపణి సాంకేతిక రంగాల అభివృద్ధికి డాక్టర్ కలాం అందించిన విశిష్ట సేవలను సీఎం ఈ సందర్భంగా స్మరించుకున్నారు.దేశ రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో డాక్టర్ అబ్దుల్ కలాం పోషించిన పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు. రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగా, ఉపాధ్యాయుడిగా ఆయన ప్రదర్శించిన నిబద్ధత, నిరాడంబర జీవనం, అసాధారణ ప్రతిభ, అచంచల దేశభక్తి ప్రతి భారతీయుడికి ఆదర్శమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.దేశాభివృద్ధి కోసం యువతలో శాస్త్రీయ దృక్పథం, దేశ సేవా భావాన్ని పెంపొందించేందుకు డాక్టర్ కలాం చేసిన కృషి ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ ప్రగతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలిగా మారిపల్లి మాధవి



**ముద్ర, హైదరాబాద్, జూలై 27:** తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలిగా మారిపల్లి మాధవిని నియమిస్తూ సంస్థ వ్యవస్థాపక చైర్‌పర్సన్ కల్వకుంట్ల కవిత సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మాధవి నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని ప్రకటించారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న సమయంలో తెలంగాణ సాంస్కృతిక వైభవం, చారిత్రక వారసత్వాన్ని పరిరక్షించి ప్రపంచానికి పరిచయం చేయాలనే లక్ష్యంతో కల్వకుంట్ల కవిత 2006లో తెలంగాణ జాగృతిని స్థాపించారు. అప్పటి నుంచి రెండు దశాబ్దాలుగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలిగా కొనసాగుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేస్తున్నారు.తెలంగాణ పల్లెలకే పరిమితమైన బతుకమ్మ పండుగను ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందేలా చేయడంలో తెలంగాణ జాగృతి కీలక పాత్ర పోషించింది. బతుకమ్మ వేడుకల ద్వారా మహిళలు పెద్ద ఎత్తున తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములు కావడానికి కూడా సంస్థ విశేషంగా దోహదపడింది.ఇకపై తాను తెలంగాణ జాగృతి ఫౌండర్ చైర్‌పర్సన్‌గా కొనసాగుతూనే, రాష్ట్ర అధ్యక్షురాలిగా మారిపల్లి మాధవి సంస్థ కార్యకలాపాలను ముందుండి నడిపిస్తారని కల్వకుంట్ల కవిత తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవన లక్ష్యాలను మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్లేందుకు ఈ నియామకం దోహదపడుతుందని పేర్కొన్నారు.

# సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ**

**ముద్ర, మాదాపూర్, జూలై 27:** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా మాదాపూర్ డివిజన్ పరిధిలోని కాకతీయ హిల్స్, ఇజ్జత్‌నగర్ కాలనీల్లో కొనసాగుతున్న ఓటరు నమోదు ప్రక్రియను పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సీనియర్ నాయకుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటరు జాబితాలో పేరు ఉన్న ప్రతి ఒక్కరూ ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తిగా నింపి, సంతకం చేసి బూత్ లెవల్ ఆఫీసర్ కు తప్పనిసరిగా అందజేయాలని సూచించారు. ఫారం సమర్పించిన తర్వాత తప్పనిసరిగా అక్నాలెడ్జ్‌మెంట్ (రసీదు) తీసుకోవాలని, ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత బీఎల్ఓలను సంప్రదించాలని తెలిపారు.ఓటరు జాబితా సవరణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న గాంధీ, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, వేగవంతంగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల్లో అవగాహన పెంచి, అర్హులైన ప్రతి ఓటరు



నమోదు ప్రక్రియలో భాగస్వామి అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్న ఆయన, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్యూమరేషన్ ఫారాన్ని నింపి బీఎల్ఓకు తిరిగి ఇవ్వకపోతే ఓటు నమోదు పూర్తికాదని స్పష్టం చేశారు.బీఎల్ఓలకు ఎదురవుతున్న ఇబ్బందులుపేద, మధ్యతరగతి ప్రాంతాల్లో ప్రజలు పెద్ద ఎత్తున నమోదు చేసుకుంటున్నప్పటికీ, హైరైజ్ భవనాలు, విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీల్లోకి బీఎల్ఓలకు అనుమతి లేకపోవడం, ఫారాలు ఆలస్యంగా అందడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని గాంధీ తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, యువత, కాలనీ అసోసియేషన్లు, గేటెడ్ కమ్యూనిటీ ప్రతినిధులు ముందుకు వచ్చి సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.పత్రాలు ఇప్పుడే అవసరం లేదుఎన్యూమరేషన్ ఫారం సమర్పించే సమయంలో ఎలాంటి ధ్రువపత్రాలు జత చేయాల్సిన అవసరం లేదని గాంధీ స్పష్టం చేశారు. అయితే ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ అనంతరం ఎన్నికల నమోదు అధికారి నోటీసు జారీ చేసిన పక్షంలో మాత్రమే పాస్‌పోర్ట్, విద్యా ధ్రువపత్రాలు, కుల ధ్రువీకరణ పత్రం, శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం, ప్రభుత్వ గుర్తింపు కార్డులు తదితర పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని వివరించారు.ఫారం సమర్పించే ముందు తప్పనిసరిగా చూసుకోవాల్సినవితాజా ఫోటో అంటించాలి.పుట్టిన తేదీ, కుటుంబ వివరాలు, మొబైల్ నంబర్ సరిగా నమోదు చేయాలి.అవసరమైన చోట సంతకం చేయాలి.ఫారం బీఎల్ఓకు ఇచ్చిన తర్వాత తప్పనిసరిగా అక్నాలెడ్జ్‌మెంట్ రసీదు తీసుకోవాలి.సమర్పించిన ఫారం, ఇతర పత్రాల ఫోటోకాపీలను భద్రంగా ఉంచుకోవాలి.ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు, స్థానిక నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న అక్రమార్కులు

**బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు బీజేపీ కౌన్సిలర్లు ఫిర్యాదు**



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలోనీ ప్రభుత్వ భూములన్ని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో బందీ అయిపోతున్నాయనీ తాండూర్ పట్టణ బిజెపి కౌన్సిలర్లు పేర్కొన్నారు. సర్వే నంబర్ 130 నూతన మున్సిపల్ కార్యాలయానికి ఎదురుగా ఉన్నప్రభుత్వ స్థలంలో అక్రమంగా భవన నిర్మాణం జరుగుతుంది, అదేవిధంగా వినాయక్ చౌక్ లోని ఎవక్యూ ప్రాపర్టీ భవన నిర్మాణం, సర్వే నంబర్ 111 వాల్మీకి నగర్ వి వి హెచ్ ఎస్ స్కూల్ కు చెందినటువంటి ప్రాపర్టీలో భవన నిర్మాణం ఈ విధంగా తాండూర్ పట్టణంలోనీ పట్టణంలోనీ ప్రభుత్వ భూములన్నీ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో బందీ అయి పోతున్నాయి. ప్రైవేట్ వ్యక్తులు మాత్రం ప్రభుత్వ అధికారులతో కుమ్మక్కె మామూళ్ల అంటగట్టి ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నారు. ఇటువంటి మోసపూరిత అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని తాండూర్ పట్టణ బిజెపి కౌన్సిలర్ లు నాగారం మల్లేశం, అంతారం కిరణ్, శ్రీకాంత్ రెడ్డి తదితరులు కలిసి వికారాబాద్ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా పట్టణ కేంద్రంలో మున్సిపల్ అలధికారుల నిర్లక్ష్యం ప్రజా ప్రతినిధుల అలసత్వం కారణంగా అక్రమార్కులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని వారు పేర్కొన్నారు.

# పారదర్శక పాలన అందించడమే లక్ష్యం

**జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్**

**ముద్ర, శేరిలింగంపల్లి:** ప్రజావాణి కార్యక్రమంలో అందిన అన్ని ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే పరిష్కార చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషర్ నారాయణ్ అమిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలను సమర్థవంతంగా, వేగంగా పరిష్కరించడం ద్వారా ప్రజాభిముఖ, పారదర్శక పాలన అందించడమే తమ లక్ష్యమని ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ల లోని ప్రజల నుండి వచ్చిన వినతులను స్వీకరించి, వారి సమస్యలను అధికారులతో కలిసి తెలుసుకున్నారు. పురపాలక సేవలకు సంబంధించిన పలు అంశాలపై ప్రజల నుండి వినతులు అందాయి. అన్ని ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులకు తక్షణమే పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.




# అక్రమ కేసులు ఎత్తివేయకుంటే మళ్లీ జెన్‌జీ పోరాటం

**ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడు కామ్రేడ్ రౌషన్ కుమార్ సిన్హా**

**ముద్ర, కాప్రా:** దేశవ్యాప్తంగా ఇతర విద్యార్థి, యువజన నాయకులపై నమోదు చేసిన తప్పుడు, రాజకీయ ప్రేరేపిత ఎఫ్ఐఆర్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ, పరీక్షల నిర్వహణలో అవకతవకలు, విద్యార్థులపై జరుగుతున్న అణచివేతకు వ్యతిరేకంగా ఏఐవైఎఫ్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా నిరసనలు చేస్తున్న విద్యార్థులు, యువజన నాయకులపై అక్రమ




కేసులు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.విద్యార్థుల హక్కులను కాలరాసే చర్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నిలిపివేసి ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఇటీవల విద్యార్థి నేతలతో కేంద్ర ప్రభుత్వం జరిపిన చర్చల్లో దేశవ్యాప్తంగా నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులు, యువతపై నమోదైన కేసులను ఉపసంహరించుకునేందుకు అంగీకరించిందని తెలిపారు. అయితే రెండు రోజుల వ్యవధిలోనే నిరసనల్లో పాల్గొన్న దేశవ్యాప్తంగా 470 మందిని అరెస్ట్ చేసి, వందలాది మందిని రిమాండ్‌కు తరలించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని విమర్శించారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. శ్రీకాంత్, హైదరాబాద్ ఏఐవైఎఫ్ అధ్యక్షుడు ఆర్. బాలకృష్ణ, పాల్గొన్నారు.

# మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా సిహెచ్ శివయ్య



**ముద్ర, తాండూర్:** యాలాల గ్రామ సర్పంచ్ సిహెచ్ శివయ్య యాలాల మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.సిహెచ్ శివయ్య మాట్లాడుతూ గ్రామాభివృద్ధి, సర్పంచుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. ఎంపీడీవో శ్రీనిజ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఎస్ఐ విఠల్ రెడ్డి ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయాలని సూచించారు.

# కేపీహెచ్‌బీ తూసానగర్‌లో విద్యార్థి అదృశ్యం



**ముద్ర, కూకట్‌పల్లి :** కేపీహెచ్‌బీ కాలనీ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీ, తూసానగర్‌లో ఓ విద్యార్థి అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించి స్థానిక పోలీసుల వివరాల ప్రకారం తూసానగర్‌కు చెందిన శ్రీ. చంద్రయ్య (వయస్సు 50, జనరల్ స్టోర్ వ్యాపారి) కుమారుడు శంకర్ (వయస్సు 19) డిగ్రీ చదువుతున్నాడు. కాగా, అదివారం అర్ధరాత్రి దాటాక సుమారు 3:30 గంటల ప్రాంతంలో శంకర్ కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఉదయం లేచి చూసేసరికి కుమారుడు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళన చెందిన తండ్రి చంద్రయ్య పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. శంకర్ ఆచూకీ తెలిసినవారు స్థానిక పోలీసులను సంప్రదించాలని అధికారులు కోరారు.

# రహదారి పనులు వేగవంతం చేయాలి

**మంత్రి శ్రీధర్ బాబు**

**ముద్ర, మేడ్చల్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కొంపల్లి–బహదూర్‌పల్లి, మియాపూర్–గండిమైసమ్మ చౌరస్తా రహదారి అభివృద్ధి పనులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా కలెక్టర్ మను చౌదరి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.రహదారి విస్తరణలో భూనిర్వాసితులకు ముందుగా నష్టపరిహారం చెల్లించాలని, అటవీ శాఖ అనుమతులు త్వరగా పొందించి పనులను వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అటవీ ప్రాంతంలోని విద్యుత్ స్తంభాల మార్పిడి పనులను ఆగస్టు 15లోగా, మిగిలిన రహదారి పనులను ప్రారంభించి సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు.దూలపల్లి,



బహదూర్‌పల్లి ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని హెచ్ఎండీఏ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, హెచ్ఎండీఏ, టీజీఎస్పీడీసీఎల్, అటవీ శాఖ అధికారులు, ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

**ముద్ర, ప్రతినిధి, రంగారెడ్డి:** ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం అనిశ్చితంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి కె. సురేంద్ర మోహన్ సూచించారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండలం వెల్జర్ల రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళాను సందర్శించి రైతులతో మాట్లాడారు. రైతు వేదికల్లో కందులు, పెసలు, మినుములు, కూరగాయలు, మేత జొన్న తదితర నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, జూలై 27 నుంచి 29 వరకు జరిగే విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వ్యవసాయ పొలాలను పరిశీలించి, లాభదాయకమైన పంటలను వేయాలని పిలుపునిచ్చారు.

# ఎల్‌బీ నగర్ కాలనీలో భార్య, ఇద్దరు కుమారులు..



**ముద్ర, నేరేడ్మెట్:** నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో భార్య, ఇద్దరు కుమారులు అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎల్‌బీ నగర్ కాలనీకి చెందిన కుటిక అశోక్ (36) జూన్ 29న వ్యక్తిగత పనుల నిమిత్తం మియాపూర్‌కు వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చేసరికి భార్య సబిత (35), కుమారులు అభిరామ్ (11), ఆర్య (1) ఇంట్లో కనిపించలేదు.భార్య, పిల్లల కోసం బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. సబిత మొబైల్ ఫోన్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్‌లో ఉన్నట్లు తెలిపాడు. భార్యతో చిన్నపాటి గొడవ జరిగిన నేపథ్యంలో ఆమె పిల్లలను తీసుకుని వెళ్లి ఉంటుందని అనుమానిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇంతకుముందు కూడా ఇలాంటి విధంగా వెళ్లి కొద్దిరోజులకు తిరిగి రావడంతో వస్తారేమోనని ఎదురుచూసిన అశోక్, చివరకు జూలై 24న నేరేడ్మెట్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 28.07.2026
www.mudranews.in | @mudranews



**కళ్ల కలక నివారణకు కాంటాక్ట్ లెన్స్, మేకప్‌కు విరామం ఇవ్వండి**

కలక పూర్తిగా తగ్గే వరకు కాంటాక్ట్ లెన్స్‌లు, కంటి మేకప్ వాడకండి. ఇవి ఇన్ఫెక్షన్‌ను మరింత పెంచవచ్చు. కొత్త మేకప్ ఉత్పత్తులు వాడటం మంచిది.



# ఆర్‌ఓబి పనులు మరింత స్పీడప్ చేయండి..

- సర్వీస్ రోడ్లు, భూసేకరణతో పాటు అనుబంధ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి
- పనుల్లో ఎలాంటి జాప్యం ఉండొద్దు..
- ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా నిర్మాణం పూర్తి చేయాలి..
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**ముద్ర, కరీంనగర్** : కరీంనగర్– చొప్పదండి ప్రధాన రహదారిపై తీగలగుట్టపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబి) పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్‌ఓబి నిర్మాణ పనుల ప్రస్తుత పురోగతి, ఇప్పటికే పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులపై ఆర్ అండ్ బి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా బ్రిడ్జి నిర్మాణంతో పాటు నాలుగు వైపులా నిర్మించాల్సిన సర్వీస్ రోడ్లు, భూసేకరణ ప్రక్రియ, డ్రైనేజీ, ఇతర అనుబంధ పనుల పురోగతిపై ఆరా తీశారు. పనులు వేగంగా సాగేందుకు అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని అధికారులకు సూచించారు.నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా ప్రతిరోజూ పర్యవేక్షణ నిర్వహించాలని, పనుల నాణ్యతలో రాజీ పడొద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడకుండా ట్రాఫిక్ నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని, నిర్మాణ ప్రాంతంలో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. సర్వీస్ రోడ్ల నిర్మాణం ఈ ప్రాజెక్టులో అత్యంత కీలకమని పేర్కొన్న కలెక్టర్, వాటి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించిన రెవెన్యూ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.

ఆర్‌ఓబి పూర్తయితే కరీంనగర్—చొప్పదండి మార్గంలో ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గడంతో పాటు రైల్వే గేటు వద్ద ఏర్పడే నిరీక్షణకు ముగింపు లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పనులను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. నిర్మాణ పనుల అమలులో ఎదురయ్యే సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించిన కలెక్టర్, పనుల పురోగతిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈఈ కుమారస్వామి, డీఈ కిరణ్, ఏఈ మధు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎల్ నినోపై రైతులకు అవగాహన కల్పించాలి

- సీఎం చంద్రబాబు



**ముద్ర, అమరావతి** : ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతుల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికా రులను ఆదేశించారు. ఆర్టీజీఎస్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రత్యా మ్నాయ పంటలు, పంటల బీమాపై రైతులకు క్యాంపెయిన్ మోడ్‌లో సమా చారం అందించాలని సూచించారు. అలాగే ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగుల పనితీరు మారాలని, విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి సైకోమెట్రిక్ పరీక్షలు, ఉపాధ్యాయులకు శిక్షణ అందించాలని అధికారులను ఆదేశించారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఏపీజే అబ్దుల్ అబ్దుల్ కలాం వర్ధంతి

-ఏపీజే అబ్దుల్ కలాం గారు భారతదేశానికి ప్రతీక



**ముద్ర, కరీంనగర్ :** భారతదేశానికి మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అందించిన సేవలు చాలా చిరస్మరణీయమని.. స్ఫూర్తిదాయకమని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలాం గారి వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక కొత్తపల్లి నుండి అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో నిర్వహించినటువంటి ప్రత్యేక వేడుకకు విశిష్ట అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ప్రారంభానికి ముందు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి కలాం గారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి వారు చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ శిలాంగ్లో విద్యార్థులకు ఉపన్యాసం ఇస్తున్న సమయంలో అకస్మాత్తుగా గుండెపోటుకు గురై చనిపోవడం చాలా విచారకరమని చెప్పారు. విద్యార్థులకు బోధిస్తూ యువతను ప్రేరేపిస్తూ తన చివరి క్షణాలను గడపడం ఆయన జీవితానికి గొప్ప నిదర్శనం.. వారి యొక్క వర్ధంతిని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు మరియు రెండు నిమిషాలు పాటు మౌనం పాటించి వారికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

# తీరనున్న విద్యార్థుల వ్యథ

- సీఎస్సార్ నిధులతో శౌచాలయ నిర్మాణం
- చొరవ చూపిన కేంద్ర సహాయ మంత్రి సంజయ్
- చొప్పదండిలో ఆరంభమైన 5 టాయిలెట్ల నిర్మాణ పనులు



**ముద్ర, కరీంనగర్ :** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు శౌచాలయం లేక పడుతున్న దురవస్థను చూసి కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ స్పందించారు. విద్యార్థుల దురవ ను తొలగించేందుకు సిద్ధమయ్యారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గ పరిధిలోని చొప్పదండి నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 227 మంది బాలురు ఉన్నారు. వీరందరికి కలిపి కేవలం ఒకే ఒక్క టాయిలెట్ ఉంది. అత్యవసర వేళలల్లో విద్యార్థులు నరకయాతన ను అనుభవిస్తున్నారు. గంటల తరబడి వరుసలో నిలబడి అవస్థలు పడుతున్నారు. ఈ తీరుపై వారి వ్యథ తో కూడిన వార్త కథనాన్ని చూసి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెంటనే అక్కడ విద్యార్థుల బాధలు తీరే విధంగా శౌచాలయాన్ని నిర్మించాలని నిర్ణయించారు.

ప్రభుత్వ నిధులతో అనుమతులు, టెండర్లు ఆలస్యమవుతునందని భావించి కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్(సీఎస్ఆర్) నిధులతో నిర్మాణానికి చొరవ చూపించారు. మంత్రి ఆదేశాలతో మలయప్ప ఫౌండేషన్ ప్రతినిధులు HPCL కు సంబంధించిన CSR నిధులతో పాఠశాల ప్రాంగణంలో 5 మరుగుదొడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా సోమవారం నిర్మాణానికి ముగ్గు పోశారు. వీలైనంత తొందరగా మూత్రశాలలను నిర్మించి విద్యార్థుల వెతలను తీరుస్తానని సంస్థ ప్రతినిధులు తెలిపారు. మంత్రి తీసుకున్న నిర్ణయం, సంస్థ తోడ్పాటుకు పాఠశాల ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఐఐటీ విద్యార్థికి కేటీఆర్ ల్యాప్‌టాప్ గిఫ్ట్




**ముద్ర, కరీంనగర్ :** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమం ద్వారా విద్యార్థులకు తన వంతుగా సహాయం అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. సోమవారం ఐఐటీ వారణాసిలో సీటు సాధించిన సిరిసిల్లకు చెందిన గడ దాస్ అభినవ్‌కు ల్యాప్‌టాప్ అందించారు. తన తల్లిదండ్రులు లక్ష్మీ నారాయణ, శ్రీలతతో కలిసి హైదరాబాద్‌లో కేటీఆర్‌ను అభినవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. నేత కుటుంబానికి చెందిన అభినవ్ ఐఐటీలో సీటు సాధించడంతో కేటీఆర్ అభినందించారు. కళాశాల ఫీజు కూడా తాను చెల్లిస్తానని హామీ ఇచ్చారు.

## వరి వద్దు...ఆరుతడి పంటలే ముద్దు..

* సుందరగిరి రైతు వేదికలో విత్తన మేళా...
* నాణ్యమైన విత్తనాల పంపిణీ



**ముద్ర, చిగురుమామిడి:** మండల వ్యవసాయ శాఖ అధికారి తాటిపల్లి పున్నం చందర్ రెడ్డి ఆధ్వర్యంలో సుందరగిరి రైతు వేదికలో 'రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాలు' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి,సర్పంచ్ జంగా శిరీష రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌లో ఎల్ నినో ప్రభావం కారణంగా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.కాబట్టి రైతులు నీటి వినియోగం ఎక్కువగా ఉండే వరి సాగును తగ్గించుకోవాలని సూచించారు.తక్కువ నీటితో,తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఇచ్చే ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని కోరారు.రైతు ముంగిట్లోకి నాణ్యమైన విత్తనాలను తీసుకురావడమే ఈ మేళా ముఖ్య ఉద్దేశమన్నారు.రమణారెడ్డి మాట్లాడుతూ పెసర్లు,కందులు,మొక్కజొన్న విత్తనాలు 50శాతం రాయితీపై రైతులకు అందించాలని కోరారు.వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ,మేలైన విత్తన రకాలతో అధిక దిగుబడులు సాధించాలని పిలుపునిచ్చారు.ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడులు సాధించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,వ్యవసాయ విస్తరణ అధికారి రాకేష్,వ్యవసాయ శాఖ సిబ్బంది,పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటలతోనే ఎల్ నినో ఇబ్బందులు దూరం

జిల్లా స్థాయి విత్తన మేళాలో కలెక్టర్ భవేష్ మిశ్రా



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్నందున రైతులు పంటమార్పిడి పద్ధతితో తక్కువ నీటితో సాగయ్యే పంటల వైపు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా కోరారు. నిర్మల్ గ్రామీణ మండలం చిట్యాల రైతు వేదికలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి విత్తన మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విత్తన ప్రదర్శన స్టాళ్లను పరిశీలించి రైతులకు పత్తి, కూరగాయలు తదితర పంటల నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని భూగర్భ జలాలను సంరక్షిస్తూ తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలు, ఉద్యానవన పంటలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు రైతులకు దీర్ఘకాలికంగా లాభదాయకమని, జిల్లాలో ప్రస్తుతం 8,751 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతుండగా, ఈ ఏడాది 1,600 ఎకరాల లక్ష్యానికి ఇప్పటికే 1,670 ఎకరాలకు సంబంధించిన నాన్–సబ్సిడీ మొత్తాన్ని రైతుల నుంచి సేకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి రమణ, సర్పంచ్ సుప్రియ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావంపై రైతుల్లో అవగాహన కార్యక్రమాలు

- ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ఉద్యోగుల పనితీరు మారాలి
- ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు



**ముద్ర, అమరావతి** : ఎల్ నినో ప్రభావంపై రైతుల్లో అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం చర్చించారు. ఈ ఏడాది అంతటా ఎల్ నినో ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుందని అంచనాలు వస్తున్న నేపథ్యంలో ఇప్పటికే తీసుకున్న చర్యలతో పాటు... రైతుల్లో మరింత అవగాహన కల్పించాలని సీఎం ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఉత్పన్నమయ్యే పరిణామాలను రైతులకు వివరించడంతోపాటు.. ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. రంపచోడవరంలో విద్యార్థి శివాని ఆత్మహత్య చేసుకున్న ఘటనను సీఎం చంద్రబాబు అధికారుల వద్ద ప్రస్తావించారు. చదువులో టాపర్ అయిన శివాని చనిపోవడం చాలా ఆవేదన కలిగించిందని అన్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని పరిశీలించేందుకు పరిస్థితిని అంచనా వేసేందుకు నిపుణుల సేవలు తీసుకోవడంతో పాటు... టీచర్లకు కూడా అవసరమైన మేరకు శిక్షణ ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారధి, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తీజ్ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ముద్ర, కోరుట్ల;** జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం అంబారీపేట, కలికోట తండాల్లో సోమవారం రోజు నిర్వహించిన తీజ్ పండుగ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు, యువతులతో కలిసి సంప్రదాయ తీజ్ ఉత్సవాల్లో పాల్గొని వారికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. విప్ వెంట రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి, కాంగ్రెస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

## పలు రూట్లలో బస్సులను నడపాలంటూ డిపో మేనేజర్ కు వినతి




**ముద్ర, కోరుట్ల;** కోరుట్ల నియోజకవర్గం లో పట్టణానికి పలు రూట్లలో బస్సులను నడపాలంటూ కోరుట్ల పట్టణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు కస్తూరి లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో ఆర్టీసి డిపో మేనేజర్ కి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నబిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ అనూప్ రావు మాట్లాడుతూ కోరుట్ల పట్టణానికి పలు గ్రామాలకు బస్సు రవాణా సౌకర్యం లేక ప్రజలు, విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురి అవ్వడమే కాకుండా, కోరుట్ల పట్టణ అభివృద్ధి, అలాగే వ్యాపారాలు సరిగా జరగక పట్టణ వ్యాపారం కుంటుపడుతుందన్నారు. అర్బన్ కాలనీ, హనుమాన్ నగర్ (ఏసుకోని గుట్ట) నుండి కల్లూరు ఆదర్శ మోడల్ స్కూల్, ఖానాపూర్–కోరుట్ల వయా (ఓబులాపూర్, మొగిలి పేట్, ముత్యం పేట్, ఐలాపూర్ ) ధాంరాజ్ పల్లి–కోరుట్ల. వయా (మల్లాపూర్, రేగుంట, ధర్మారం, ఐలాపూర్ ) చింతకుంట– కోరుట్ల వయా ( కథలాపూర్, భూషణ్ రావు పేట్, ఊట్పల్లి, పేగర్ల, చింతకుంట) ఉదయం 3 నుండి 4 గంటల మధ్య,6 గంటల నుండి 8 గంటల మధ్య కోరుట్ల నుండి హైదరాబాద్ బస్సులను నడాపలంటూ వినతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి కార్యదర్శి సుదవేణి మహేష్, ఎండోమెంట్ జిల్లా కన్వీనర్ మాడవేణి నరేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు తులసి కృష్ణ, కౌన్సిలర్లు ఇందూరు తిరుమల వాసు, కలాల రాధా సాయి చందు, గుగులావత్ శ్రీకాంత్, కోరుట్ల పట్టణ ప్రధాన కార్యదర్శి ఎర్ర రాజేందర్, చెట్లపల్లి సాగర్, మేకల గణేష్, గందె నవీన్, ఉపాధ్యక్షులు మైదం సత్యనారాయణ, బిజెపి, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం పిఎస్ ను తనిఖీ చేసిన మెట్ పల్లి డిఎస్పి




**ముద్ర, కోరుట్ల;** వార్షిక తనిఖీలో భాగంగా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ ను మెట్పల్లి డీఎస్పి ఏ. రాములు తనిఖీ చేశారు. డీఎస్పి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి స్టేషన్ లోని పలు రికార్డు లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా డీఎస్పీ రాములు, సీఐ సురేష్ బాబు స్టేషన్ ఆవరణలో మొక్కలను నారు. ఇబ్రహీంపట్నం ఎస్సై జి. నవీన్ కుమార్, మల్లాపూర్ ఎస్సై ఏ.అనిల్ పాల్గొన్నారు.

## డీజీపీని మర్యాదపూర్వకంగా కలిసిన జువ్వాడి నర్సింగరావు



**ముద్ర, కోరుట్ల;** తెలంగాణ రాష్ట్ర తొలి వెలమ కార్పొరేషన్ చైర్మన్ కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు హైదరాబాద్ డీజీపీ కార్యాలయంలో డిజిపి సీవీ ఆనంద్ ని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. అనంతరం పూల బొకేను అందజేసి శాలువాతో సన్మానించారు.

## గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** గోమాతను జాతీయ జంతువుగా ప్రక5ఉంచాలని కోరుతూ ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. దేశవ్యాప్తంగా సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని 300 మంది కలెక్టర్ కు అందజేశారు. నిర్మల్ జిల్లా ప్రజల నుంచి విశేష స్పందనతో 3,42 లక్షల మంది సంతకాలు చేసి ఈ ఉద్యమానికి మద్దతు తెలిపారని తెలిపారు. ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే ఈ వినతిపత్రాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపించి తగిన చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 28.07.2026
www.mudranews.in | @mudranews



**కళ్ల కలక నివారణకు..**



వ్యక్తిగత వస్తువులు పంచుకోవద్దుతువాలు, రుమాలు, దిండు కవర్లు ఇతరులతో పంచుకోవద్దు. వీటిని తరచూ ఉతికితే సూక్ష్మక్రిముల వ్యాప్తి తగ్గుతుంది. కుటుంబ సభ్యులకు కూడా రక్షణ ఉంటుంది.

# విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు

- ఉచితాలు కావు.. ప్రజా పెట్టుబడులు
- అర్ధాకలితో ఏ బిడ్డ బడికి వెళ్లొద్దు
- సానబెట్టిన వజ్రాల్లా మానవ వనరులు
- పాలన అంటే పెత్తనం కాదు.. సమాజ హితం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఉచిత సంక్షేమ పథకాలు ప్రజలపై ప్రభుత్వం పెట్టే పెట్టుబడేనని, వాటిని విమర్శించడం సరైన దృక్పథం కాదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా మధిరలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషకాహార అల్పాహారం అందించే సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ను ప్రారంభించిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.ప్రభుత్వం పరిశ్రమలు, ప్రాజెక్టులపై పెట్టుబడులు పెట్టినట్లే పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాలు సహా ప్రజల అభివృద్ధిపై కూడా పెట్టుబడి పెడుతుందని చెప్పారు. అలాంటి పెట్టుబడులు ప్రజలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.రాష్ట్రంలో ఏ బిడ్డ కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని భట్టి తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అని పేర్కొంటూ, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ శారీరక, మానసిక వికాసం కోసం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత అల్పాహార పథకాన్ని ప్రారంభించామని చెప్పారు.విద్యార్థులు ఆకలితో తరగతుల్లో ఏకాగ్రత కోల్పోకుండా ఉండేందుకే ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి సహజ వనరులతో పాటు నాణ్యమైన మానవ వనరులు కూడా అత్యంత కీలకమని, ప్రపంచానికి దిశానిర్దేశం చేసే ప్రతిభావంతులైన విద్యార్థులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 27 లక్షల మంది విద్యార్థులకు ఒకే సమయంలో వేడివేడిగా అల్పాహారం అందించడం చారిత్రాత్మక నిర్ణయమని భట్టి పేర్కొన్నారు. ప్రపంచంలో ఇంత పెద్ద స్థాయిలో ఈ తరహా కార్యక్రమాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వం అరుదేనని తెలిపారు.హరే కృష్ణ మిషన్ భాగస్వామ్యంతో అత్యాధునిక యాంత్రిక వంటశాలల ద్వారా నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం మధిరలోని తాత్కాలిక సెంట్రలైజ్డ్ కిచెన్ నుంచి 16 మండలాల పాఠశాలలకు అల్పాహారం సరఫరా చేస్తున్నామని, రాబోయే మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా శాశ్వత కమ్యూనిటీ కిచెన్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని వెల్లడించారు.విద్యార్థులకు అల్పాహారంతో పాటు పోషకాహారం కోసం వారానికి మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగి జావ అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

ఈ కార్యక్రమంలో హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ అధ్యక్షులు సత్య గౌర చంద్ర దాస ప్రభుజీ, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ సీఈఓ, కౌంతేయ స్వామీజీ, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, కార్పొరేషన్ చైర్మన్లు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాయల నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## ఈత, ఖర్జూర మొక్కలు నాటే కార్యక్రమం వేగవంతం చేయాలి

**జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్. తూక్య నాయక్**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ఈత, ఖర్జూర మొక్కలు నాటే కార్యక్రమం వేగవంతం చేయాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్. తూక్య నాయక్ అన్నారు. సోమవారం భువనగిరి మండలం వడాయిగూడెం గ్రామంలోని ఊర కుంట కట్టపై వీబీజీ రామ్ జి (వికాస్ భారత్ గ్యారంటీ – ఉపాధి హామీ పథకం) ఆధ్వర్యంలో చేపడుతున్న ఈత, ఖర్జూర, మొక్కల పెంపకం స్థలాన్ని గ్రామ సర్పంచ్ నీల శిరీష ఓంప్రకాశ్ గౌడ్ నేతృత్వంలోని గ్రామ పంచాయతీ పాలకవర్గం, ఎక్సైజ్ అధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈత, ఖర్జూర,తాటి వనాలను విస్తరించడం వల్ల స్థానిక గీత కార్మికులకు దీర్ఘకాలికంగా మెరుగైన జీవనోపాధి లభిస్తుందని, వారి ఆర్థిక పరిపుష్టికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.సర్పంచ్ నీల శిరీష ఓంప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ వడాయిగూడెం గ్రామంలో ఊర కుంట కట్టపై ఈత, ఖర్జూర మొక్కలు నాటే కార్యక్రమాన్ని అతి త్వరలోనే ప్రారంభించనున్నాం. గీత కార్మికుల సంక్షేమానికి, పచ్చదనం పెంపొందించడానికి గ్రామ పంచాయతీ పాలకవర్గం తరఫున పూర్తి సహకారం అందిస్తూ నీటి సౌకర్యం,రక్షణ చర్యలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సి.ఐ వేణు కుమార్, ఎస్.ఐ కడారి గణేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కె. ఆమని, వార్డు సభ్యులు పబ్బాల ఉమ–రమేష్, కోట దీప–జహంగీర్, కోట సుధావాణి, బబ్బూరి భరత్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షులు బబ్బూరి సాగర్ గౌడ్, నాయకులు బండారు పద్మ, బబ్బూరి రవి, సుక్కల నర్సింహ, కూలీలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఉచిత జర్మన్ భాషా శిక్షణ

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఉమ్మడి ఖమ్మం జిల్లా నిరుద్యోగ యువతీ, యువకులకు జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో జిల్లా ఉపాధి కార్యాలయం టామ్ కామ్ ఆధ్వర్యంలో నర్సింగ్, ఫిజియోథెరపీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు ఉచితంగా జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. జర్మనీలో వైద్య రంగంలో అర్హత కలిగిన నర్సింగ్, ఫిజియోథెరపీ నిపుణులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. జర్మన్ భాషలో నైపుణ్యం సాధించడం ద్వారా విదేశాల్లో మెరుగైన ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. జర్మన్ భాషా శిక్షణ పూర్తయిన అనంతరం నిర్వహించే అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు జర్మనీలో ఉద్యోగ అవకాశాల కోసం షరతులతో కూడిన ఉద్యోగ ఎంపిక ధ్రువీకరణ పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని నర్సింగ్, ఫిజియోథెరపీ కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా ఉపాధి కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం ఖమ్మం కలెక్టరేట్ మొదటి అంతస్తులోని ఎఫ్ –18 లోని జిల్లా ఉపాధి కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

## తెలంగాణ జర్నలిస్టుల జట్టుకు మంత్రి పొంగులేటి అభినందనలు

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ లయోలా కాలేజీ మైదానంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన తెలంగాణ స్పోర్ట్స్ జర్నలిస్టుల జట్టుకు తెలంగాణ రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందనలు తెలిపారు. జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి విజయాన్ని అందించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా జర్నలిస్ట్ మానుకొండ రవికిరణ్ ను మంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. ఖమ్మం జిల్లాకు చెందిన విలేకరి సారథ్యంలో తెలంగాణ జట్టు అంతర్రాష్ట్ర స్థాయిలో ఛాంపియన్‌గా నిలవడం గర్వకారణమని కొనియాడారు. క్రీడలు మానసికోల్లాసంతో పాటు జర్నలిస్టుల మధ్య ఐక్యతను, రెండు రాష్ట్రాల ప్రతినిధుల మధ్య స్నేహ సంబంధాలను బలోపేతం చేస్తాయని స్పష్టం చేశారు. భవిష్యత్తులోనూ తెలంగాణ స్పోర్ట్స్ జర్నలిస్టుల జట్టు ఇలాంటి విజయాలను మరెన్నో సాధించాలని ఆకాంక్షించారు.

# అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయాలి

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు**



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సూచించారు. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 43వ డివిజన్‌లో రూ.61.50 లక్షల సుడా నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగ పడే ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతతో చేపట్టి పదికాలాల పాటు మన్నికగా ఉండే విధంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనుల అమలులో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రభుత్వ నిధులను పారదర్శకంగా వినియోగించాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులతో పాటు స్థానిక ప్రజలు కూడా నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజల భాగస్వామ్యంతో చేపట్టే పనులు మరింత నాణ్యతగా పూర్తవుతాయని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ ఖమ్మం నగర అభివృద్ధికి వందల కోట్ల రూపాయలను విడుదల చేస్తూ ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాలను కల్పిస్తోందని అన్నారు.ఖమ్మం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి పలు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. నగరంలో విశాలమైన రహదారులు, మెరుగైన మౌళిక సదుపాయాలు కల్పించడం ద్వారా అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని మంత్రి పేర్కొన్నారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న మంత్రి, పరిశుభ్రత వల్ల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా కుటుంబాలపై వైద్య ఖర్చుల భారం తగ్గుతుందని అన్నారు.

**అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులు పరిశీలించిన మంత్రి తుమ్మల**

నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులు పురోగతిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఖమ్మం నగరంలో వరద గండం లేకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఖానాపురం చెరువు అలుగు వరద పోటెత్తగా అనేక డివిజన్లు ముంపుకు గురయ్యాయని మంత్రి అన్నారు. వరాల వరద నీటిని తరలించేందుకు వంద కోట్లతో అండర్ గ్రౌండ్ పైప్ లైన్ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఖమ్మం నగరానికి తాగు నీటి ఎద్దడి లేకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. కృష్ణా నది నీళ్లు సరఫరా కానీ పక్షంలో గోదావరి నీళ్లతో పరిష్కారం చేయనున్నామన్నారు. గోదావరి జలాలు మున్నేరు వరకు తరలించామని తెలిపారు. నగరంలో వరద ముంపు తాగు నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు. 200 కోట్లతో అమృత్ పథకం పనులు సాగుతున్నాయన్నారు. ఆటోమేషన్ విధానంలో అమృత్ పథకం ద్వారా రక్షిత తాగునీరు సరఫరా చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఖమ్మం నగరంలో తాగు నీటి పథకం అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులకు సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా మంత్రి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర పాలక సంస్థ పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రంజిత్, అధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

## మహిళా సంఘ భవనానికి భూమిపూజ



**ముద్ర, తుర్కపల్లి:** తుర్కపల్లి మండలం కోనాపూర్ గ్రామంలో మహిళా సంఘ భవన నిర్మాణానికి సోమవారం గ్రామ సర్పంచ్ చాడ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నీల మమత దుర్గయ్య, అక్కెనపల్లి శ్రీలత బంగారు రెడ్డి, పసుపుల కనకయ్య, పంచాయతీ కార్యదర్శి ఒగ్గు మధు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నీల నరసింహులు, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పసుపుల నర్సింలు, మహిళా సంఘ బంద అధ్యక్షురాలు చాడ జయమ్మ, గ్రామ పెద్దలు అక్కెనపల్లి నారం రెడ్డి, పసుపుల చంద్రయ్య, నీల కిష్టయ్య, మాజీ వార్డు సభ్యులు పసుపుల జహంగీర్, నీల యాదగిరి, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**:జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 134 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 64 , జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ 17, సర్వే ల్యాండ్స్ 8, మున్సిపాలిటీ 8,డి.పి. ఓ 6, మైనింగ్ 4, ఉపాధి కల్పన 3, సంక్షేమ శాఖ 3, వైద్య ఆరోగ్య 2,ఇరిగేషన్ 2,జిల్లా పరిషత్ 2, వ్యవసాయ 2,విద్య శాఖ 2, సివిల్ సప్లై,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్,విద్యుత్,ఎల్.డి. ఎం, డి . సి. ఓ, ఆర్టీసీ, హౌసింగ్, చేనేత, జౌళి ,కోపరేటివ్, పౌర సంబంధాలు,పొల్యూషన్ కంట్రోల్ బోర్డు శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయన్నారు. కార్యక్రమంలో డి.ఆర్.ఓ జయమ్మ, డిప్యూటీ కలెక్టర్లు సాత్విక్, కృతిక, జెడ్పీ సీఈఓ శోభా రాణి, జిల్లా గ్రామీణా అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ అలివేలు, అధికారులు పాల్గొన్నారు.

## ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అమలుకు చర్యలు

**డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.మనోహర్**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** యాదాద్రి భువనగిరి జిల్లాను తెలంగాణ రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ మోడల్ జిల్లాగా ఎంపిక చేసిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ అమలుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.మనోహర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నమోదిత ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ఫార్మసీలు, మెడికల్ షాపులకు సంబంధించిన హెల్త్ ఫెసిలిటీ రిజిస్ట్రీ, వైద్యులు, ఆరోగ్య నిపుణులకు సంబంధించిన హెల్త్‌కేర్ ప్రొఫెషనల్ రిజిస్ట్రీ నమోదును 39 ప్రత్యేక బృందాల ద్వారా పూర్తి చేసినట్లు తెలిపారు.తదుపరి దశలో ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ఫార్మసీలు, మెడికల్ షాపులు, లేబొరేటరీలలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ సమర్థవంతమైన అమలు కోసం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆరోగ్య సంస్థల వైద్యులు, ఆరోగ్య నిపుణులు, యాజమాన్య ప్రతినిధులకు ఒకరోజు అవగాహన వర్క్‌షాప్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో 29న ఉదయం 10:00 గంటలకు కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో నిర్వహించే వర్క్‌షాప్–కమ్–అవేర్‌నెస్ కార్యక్రమానికి యాదాద్రి భువనగిరి జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్స్, డయాగ్నస్టిక్ సెంటర్ల మేనేజింగ్ డైరెక్టర్లు/యాజమాన్య ప్రతినిధులు, అలాగే ప్రతి ప్రైవేట్ ఆసుపత్రి, నర్సింగ్ హోమ్, క్లినిక్ నుండి ఒక వైద్యుడు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

## రైతులకు విత్తనాల కొరత రానివ్వం

**ముద్ర, బీబీనగర్:** రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలను ఏ విధమైన కొరత లేకుండా పంపిణీ చేస్తామని బీబీనగర్ వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు పొట్టోళ్ల శ్యామ్ గౌడ్ తెలిపారు. మండల కేంద్రమైన బీబీనగర్ రైతు వేదికలో సోమవారం విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని పొట్టోల శ్యామ్ గౌడ్ తో పాటు బీబీనగర్ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ ఉప్పలంచి శ్రీకాంత్ , మైలారం మహేష్ మండల్ అగ్రికల్చర్ ఆఫీసర్ పద్మ , బీబీనగర్ క్లస్టర్ ఏఈఓ ఉదయ్ కిరణ్ ,వెంకిర్యాల ఏఈఓ అమూల్య , రాయరావుపేట ఏఈఓ నవిత పాల్గొన్నారు.

# తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన

**రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి**
**తహశీల్దార్ నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర ఆగ్రహం**
**సమస్యలు పరిష్కరించకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరిక**



**ముద్ర, తుర్కపల్లి :** మండలంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బాధిత రైతులతో కలిసి సోమవారం తుర్కపల్లి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కార్యాలయం మెట్లపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తూ రైతులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రైతులు తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి పలుమార్లు తహశీల్దార్ కార్యాలయానికి వచ్చినప్పటికీ, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రైతులను కార్యాలయం చుట్టూ తిప్పుతూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. మండలంలో భూ సంబంధిత సమస్యలు, రెవెన్యూ దరఖాస్తులు, పాస్‌బుక్‌లు, మ్యుటేషన్‌లు తదితర అంశాలు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నప్పటికీ అధికారులు స్పందించడం లేదని పేర్కొన్నారు. రైతుల ఇబ్బందులను గుర్తించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. .రైతుల పట్ల తహశీల్దార్ వ్యవహరిస్తున్న తీరుపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా తహశీల్దార్ తన వైఖరిని మార్చుకుని రైతుల సమస్యలను పరిష్కరించకపోతే, వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, రైతు సంఘాలతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## పాఠశాల సమస్యలను పరిష్కరించాలి

**ముద్ర, దేవరకొండ:** ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కొండమల్లెపల్లి మండల కేంద్రంలో సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ మాట్లాడుతూ పాఠశాలలో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యా, మౌలిక వసతుల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. సర్వేలో తరగతి గదుల కొరత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, ఫర్నిచర్ కొరత, ఉపాధ్యాయుల సమస్యలు తదితర అంశాలను గుర్తించినట్లు అన్నారు. సమస్యలపై సమగ్ర నివేదికను సిద్ధం చేసి, దేవరకొండ ఆర్డీవో పద్మప్రియకు ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మండల అధ్యక్షుడు రామావత్ రాజేష్, నాగరాజు, ఏ. సుధాకర్, అంకురి ప్రణయ్, దుళ్ల కార్తీక్, నీతిన్, బత్తుల శివ, నేతళ్ళ జైరాం పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 28.07.2026
www.mudranews.in | @mudranews



**కళ్ల కలక నివారణకు**



లక్షణాలు తగ్గకపోతే వైద్యుడిని సంప్రదించండి. కలకతో పాటు తీవ్రమైన నొప్పి, చూపు మందగించడం లేదా ఎక్కువ చీము వస్తే వెంటనే నేత్ర వైద్యుడిని కలవండి. అవసరమైతే వైద్యుడు కంటి చుక్కలు లేదా ఇతర చికిత్స సూచిస్తారు.

# రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**పది లక్షల సాధారణ బీమా అందించాలి వీవో ఏలకు అదనపు పని భారాన్ని తగ్గించాలి సిఐటియు రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి వివోఏల జిల్లా అధ్యక్షుడు తలపాక కిష్టయ్య**






**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** ఇరువై సంవత్సరాలుగా గ్రామ స్థాయిలో వివో ఎల్ గా సేవలందిస్తున్న సెర్ప్ నుండి వివోఏలకు ప్రభుత్వం ఇప్పటికీ కనీస వేతనం అమలు చేయకపోవడం దురదృష్టకరమనిసీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి,వివోఏల జిల్లా అధ్యక్షుడు తలపాక కిష్టయ్య, రాష్ట్ర నాయకుడు మహేష్ విమర్శించారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐకెపి వివోఏలను ఉద్యోగులుగా గుర్తించి నెలకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సెర్పు నుంచి జారీ చేసిన సర్క్యులర్‌కు అనుగుణంగా గ్రామ స్థాయి నుంచి వివోఏల వేతనాలను నేరుగా వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కోరారు.వివోఏలకు రూ.10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా అమలు చేయడంతో పాటు సెర్పు సీఈవో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. విధుల నిర్వహణకు అవసరమైన ట్యాబ్, ఇంటర్నెట్ (నెట్) సౌకర్యాలను కల్పించాలని కోరారు.ఆదాయం లేని గ్రామ సంఘాలకు రూ.20 లక్షల ప్రత్యేక నిధిని మంజూరు చేయాలని, ప్రతి బుధవారం నిర్వహిస్తున్న సమావేశాలను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. గ్రామ స్థాయిలో పనిచేస్తున్న వివోఏలపై అదనపు పనిభారం తగ్గించి, రాజకీయ నాయకుల జోక్యాన్ని అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లాకు చెందిన వివోఏలు యమున, నిఖిత,మల్లేశం, సుమలత,సిఐటియు జిల్లా సహాయక కార్యదర్శి బానర్సయ్య, వివోఏలు రాజు, మమత,మంగమ్మ, శ్రీనివాస్ , మన్నె లక్ష్మి ,లావణ్య, జ్యోతి, ఎల్ల స్వామి, మల్లేశం, శోభ రాణి, బాబు, పుష్ప, శంకర్, రాములు, లక్ష్మణ్, హారిక, తోపాటు వివిధ మండలాల వివో ఎలా అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అభివృద్ధికి కేంద్ర మంత్రులతో మంత్రి వివేక్ వెంకటస్వామి కీలక భేటీ





**ముద్ర, న్యూఢిల్లీ:** తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై కేంద్ర ప్రభుత్వ సహకారం కోరుతూ రాష్ట్ర శక్తి, కార్మిక, శిక్షణ, ఉపాధి & ఫ్యాక్టరీల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణతో కలిసి సోమవారం పలువురు కేంద్ర మంత్రులను కలిశారు.కేంద్ర కార్మిక శాఖ మంత్రి డా. మన్సుఖ్ మాండవీయ, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరి, బొగ్గు & గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డితో సమావేశమై తెలంగాణలో ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, కార్మిక సంక్షేమం, గనుల అభివృద్ధిపై వినతిపత్రాలు అందజేశారు.పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని తాడిచెర్ల–2 బొగ్గు గని ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసి స్థానిక యువతకు కనీసం 1,000 ఉద్యోగాలు కల్పించాలని, నిర్వాసితులకు సమగ్ర పునరావాసం కల్పించాలని కోరారు. అలాగే సింగరేణి రిటైర్డ్ కార్మికులకు కనీసం రూ.10 వేల నెలవారీ పెన్షన్ అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ అంశాలను సానుకూలంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రులు హామీ ఇచ్చినట్లు మంత్రి డా. వివేక్ వెంకటస్వామి తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, యువతకు ఉపాధి, కార్మిక సంక్షేమం కోసం కేంద్రంతో సమన్వయంగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు.

# ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా పని చేయాలి

**జిల్లా కలెక్టర్ హైమావతి**





**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** భూసర్వేలను చట్టం నిర్దేశించిన నిబంధనలకు లోబడి పారదర్శకంగా నిర్వహిస్తూ, ప్రజల్లో రెవెన్యూ, సర్వే శాఖలపై విశ్వాసం పెంపొందించేలా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సూచించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో భూభారతి–భూసర్వే రీ–సర్వేపై రెవెన్యూ, సర్వే శాఖల అధికారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ముందుగా గ్రామ సరిహద్దులు (విలేజ్ బౌండరీ), ప్రభుత్వ భూములు, పట్టా భూములు, అనంతరం గ్రామకంఠం ప్రకారం భూములను సర్వే చేయాలని సూచించారు. ఒక రెవెన్యూ గ్రామానికి మాత్రమే నిర్దిష్ట హద్దులు ఉంటాయని, రెవెన్యూ రికార్డుల ఆధారంగానే భూములను నిర్ధారించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన సర్వే నిర్వహించి, చట్టబద్ధంగా అనుభవంలో ఉన్న వారికి యాజమాన్య హక్కులు కల్పించేలా చర్యలు చేపట్టాలని అన్నారు.భూసర్వే విధానంలో కాలానుగుణంగా అనేక మార్పులు చోటుచేసుకున్నాయని పేర్కొంటూ, రెవెన్యూ కార్యాలయాల్లో శాశ్వత రికార్డులను పటిష్టంగా నిర్వహించి రికార్డ్ గదుల్లో భద్రపరచాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల సరిహద్దుల్లో చట్ట ప్రకారం శాశ్వత సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేసి, పకడ్బందీ మ్యాపులను సిద్ధం చేయాలని సూచించారు. ఆయా రికార్డులను సర్వే, రెవెన్యూ, జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో భద్రపరిచేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.రికార్డు గదులను పటిష్టంగా ఏర్పాటు చేయడంతో పాటు ప్రతిరోజూ నిర్దేశించిన లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల్లో రెవెన్యూ, సర్వే శాఖలపై నమ్మకాన్ని పెంపొందించే విధంగా విధులు నిర్వహించాలని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం లేదా అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ల వద్దకు వచ్చే పత్రాల్లో అన్ని వివరాలు సక్రమంగా ఉన్నవాటినే ధ్రువీకరించాలని, చట్టం నిర్దేశించిన మేరకే అన్ని పనులు చేపట్టాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్, డీఆర్వో నాగరాజమ్మ, సిద్ధిపేట, హుస్నాబాద్, గజ్వేల్ ఆర్డీఓలు సదానందం, రామూర్తి, చంద్రకళ, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ భవ్య, తహసీల్దార్లు, సర్వే అధికారులు పాల్గొన్నారు.

## సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించాలి

**రాష్ట్ర సేవికా సమితి**



**ముద్ర, హైదరాబాద్:** యువతకు సరైన సమయంలో వివాహం, సంతానోత్పత్తి, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించాలని రాష్ట్ర సేవికా సమితి అఖిల భారత కార్యకారిణి ప్రతినిధి మండలి పిలుపునిచ్చింది. హైదరాబాద్‌లో జరిగిన సమావేశాల్లో దేశంలోని జనాభా ధోరణులు, సామాజిక అంశాలపై తీర్మానం చేసింది.జనాభా అసమతుల్యత, అక్రమ చొరబాట్లు, మతమార్పిడులు, సామాజిక సామరస్యంపై ప్రభావం వంటి అంశాలపై ఆందోళన వ్యక్తం చేసిన ప్రతినిధి మండలి, దేశవ్యాప్తంగా అన్ని వర్గాలకు వర్తించే ఏకరీతి జాతీయ జనాభా విధానం అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. అలాగే అక్రమ చొరబాట్లను అరికట్టేందుకు సరిహద్దు భద్రతను బలోపేతం చేయాలని, చట్టాలను కఠినంగా అమలు చేయాలని సూచించింది.కుల, వర్గ రాజకీయాలకు బదులుగా విద్య, మహిళా సాధికారత, ఆర్థికాభివృద్ధి ద్వారా సమాజాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది. దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జనాభా సంబంధిత సవాళ్లపై సమాజంలో విస్తృత అవగాహన కల్పించాలని గుడిమెళ్ల అనంతలక్ష్మి, ఉమారాణి, చారుశీల తెలిపారు.

**వృద్ధ దంపతులను మోసం చేసి మంగళసూత్రం అపహరించిన**

# ఇద్దరు నిందితులు అరెస్ట్





**ముద్ర, బీబీనగర్ :** ప్రభుత్వ ఉచిత పథకాల నమోదు అంటూ వృద్ధ దంపతులను మోసం చేసి బంగారు మంగళసూత్రం అపహరించిన ఇద్దరు నిందితులను బీబీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం భువనగిరి డీఎస్పీ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 12న బీబీనగర్ పట్టణానికి చెందిన కుక్కదూవ్వ అండాలు తన భర్తతో కలిసి ఇంట్లో ఉండగా ఇద్దరు వ్యక్తులు వచ్చి తాము ప్రభుత్వ ఉచిత బియ్యం పంపిణీ పథకానికి సంబంధించిన అధికారులమని చెప్పారు. వివరాలు నమోదు చేయడానికి ఫొటో తీయాలని చెప్పి, 'మెడలో ఉన్న బంగారు గొలుసు ఫొటోకు అడ్డుగా వస్తోందని తీసి వేయాలని నమ్మించి కాజేసి పరారయ్యారని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, సత్యసాయి జిల్లాకి చెందిన సింహాద్రి గంగాధరప్ప (22), కర్ణాటక రాష్ట్రం, చిక్కబళ్లాపూర్ జిల్లాకు చెందిన జంగాల శివరాజ్ (38)లని వారి వద్ద నుంచి 30 గ్రాముల బంగారు మంగళసూత్రం, ఎన్ఎస్–200 పల్సర్ మోటార్ సైకిల్, ఐఫోన్ మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.వీరిపై ఆంధ్రప్రదేశ్‌లోని లేపాక్షి, పెనుకొండ, గోరంట్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు ఆస్తి నేరాలకు సంబంధించిన కేసులు నమోదై ఉన్నట్లు గుర్తించారు. కేసును ఛేదించడంలో బీబీనగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం. ప్రభాకర్ రెడ్డి, ఎస్ఐ ఎన్. రమేష్, హెడ్ కానిస్టేబుల్ బి. అంజయ్య, పోలీస్ కానిస్టేబుళ్లు పి. శ్రీనివాస్, జి. జనార్ధన్, భువనగిరి టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కొండారెడ్డి, రమేష్ చేసిన కృషికి అభినందించారు.

## ముదిరాజ్ లను బీసీ ఏ లోకి మార్చాలి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రజా ప్రభుత్వం మేనిఫెస్టో లో పెట్టిన విధంగా ముదిరాజ్ లను బిసి డి నుండి బిసి ఏ లోకి మార్చాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు గుర్రాల బాలకృష్ణ ముదిరాజ్ ప్రభుత్వాన్ని సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ముదిరాజ్ లకు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో జనాభా ప్రాతిపదికన వాటాలు కేటాయించాలన్నారు. ముదిరాజుల జనాభా పరంగా తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా ఉన్నప్పటికీ ఇప్పటికీ అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారని బీసీ డీ నుండి బీసీఏలో కి మార్చడం ద్వారానే ముదిరాజ్ లకు న్యాయం జరుగుతుందని గుర్తు చేశారు.

## ఆపద సమయంలో అండగా యూత్ కాంగ్రెస్ నాయకులు



**ముద్ర, చేర్యాల:** సిద్దిపేట పట్టణానికి చెందిన పోతుల శ్రీనివాస్ కు ఎమర్జెన్సీగా ఆపరేషన్ కు రక్తం అవసరం ఉందని తెలిసి ఆర్ వి ఎం హాస్పిటల్ కి వెళ్లి రక్త దానం చేసిన జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అందె నానిబాబు , చేర్యాల పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చింతల మల్లేశం. అనంతరం పోతుల శ్రీనివాస్ ఆపరేషన్ అయ్యేవరకు అక్కడే ఉండి వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా యువనాయకులు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడంతో ఒక నిండు ప్రాణదాతగా మిగులుతారు అని. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని తెలిపారు..

## పాఠశాల ఎండీ అనుమానాస్పద మృతి



**ముద్ర, దేవరకొండ:** చింతపల్లి మండల పరిధిలోని మాల్ గ్రామానికి చెందిన ది రైనో బో స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ గరీబ్ ఖాజా నవాబ్ (45) ఆత్మహత్య చేసుకున్నాడు.స్థానికంగా విషాదాన్ని నింపింది.కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. మహ్మద్ గరీబ్ ఖాజా నవాబ్ కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు, అప్పుల కారణంగా తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో సోమవారం (జూలై 27) తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన, మధ్యాహ్నం తన పాఠశాలలోని ఓ గదిలో ఫ్యాన్‌కు ప్లాస్టిక్ తాడుతో ఉరి వేసుకుని కనిపించినట్లు సమాచారం. ఈ విషయాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలియజేయడంతో వారు అక్కడికి చేరుకుని చూడగా, ఆయన అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని కిందకు దించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య మహ్మద్ షబానా ఇచ్చిన ఫిర్యాదులో, ఆర్థిక ఇబ్బందులు మరియు అప్పుల కారణంగా మనస్తాపానికి గురై తన భర్త ఈ ఘాతుక నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు గల ఖచ్చితమైన కారణాలపై విచారణ కొనసాగుతోందని చింతపల్లి ఎస్సై రామ్మూర్తి తెలిపారు.

# రైతులు ఆరుతడి పంటలనే పండించాలి

**మండల వ్యవసాయాధికారి జానకిరాములు**



**ముద్ర, దేవరకొండ:** ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తగ్గుముఖం పడుతున్న కారణంగా మండల రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి ఎర్రంశెట్టి జానకిరాములు రైతులకు సూచించారు. సోమవారం రైతువేదికలో రైతు మేళాలో మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పుడు తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలు సాగు చేయడం రైతులకు ఎంతో మేలన్నారు. పెసర్లు, మినుములు, కందులు, జొన్నలు, మొక్కజొన్న వంటి పంటలను సాగు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందవచ్చునని రైతులకు సూచించారు. ఏఈఓలు మల్లేష్, తులసి, మాధురి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555